

GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026









సుందర చైతన్య గ్రంథాలయం
హైదరాబాద్ ప్రారంభోత్సవం (మార్చి 2005)









Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.

IF UNDELIVERED PLEASE RETURN TO :

SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

గిరిధారి

నవంబరు 2025

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు



నలభై సంవత్సరాలుగా లక్షలాది మందిని
ప్రభావితం చేస్తూ, ఇరవై వేల మంది
జీవిత సభ్యులను కలిగియున్న
అసమాన ఆధ్యాత్మిక మాసపత్రిక






4 ప్రార్థన 0



శ్లో॥ ఏతే చాంశ కలాః పుంసః
కృష్ణస్తు భగవాన్ స్వయమ్ ।
ఇంద్రారి వ్యాకులం లోకం
మృడయన్తి యుగే యుగే ॥

రాక్షసులచే కలత చెందిన లోకమును ప్రతి యుగం లోను కాపాడే బ్రహ్మాది దేవతలు భగవానుని అంశకళలు. శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవానుడే.



గిరిధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 40 సంచిక : 12

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

సంపాదకులు : **శ్రీ స్వామి సుందర చైతన్యానంద**

ఇందులో


జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (**email** : *admin@sundarachaitanyam.org*)



ఆప్తవాక్యం

నమస్కారము

ఆత్మబంధువులారా!

పందొమ్మిది వందల ఎనభై ఐదవ సంవత్సరం నవంబరు మాసంలో 'గిరిధారి' ప్రథమ సంచిక ఆవిర్భవించింది. రెండువేల ఇరవై ఐదవ సంవత్సరము నవంబరు సంచికను మీరు నేడు చదువుతున్నారు. ఈ సంచికతో 'గిరిధారి'కి నలభై సంవత్సరాలు పూర్తి అయ్యాయి.

నా ముప్పై ఎనిమిదవ ఏట 'గిరిధారి' సంపాదకత్వాన్ని చేపట్టాను. ప్రస్తుతం డెబ్బై ఎనిమిదవ సంవత్సరంలో ప్రవేశించాను. నలభై సంవత్సరాలు నిర్విరామంగా గిరిభారాన్ని భుజాల కెత్తుకొని మోసాను.

కాలాగ్నిలో పడి కరిగి పోకుండా, కాలి పోకుండా జీవనకళను సంతరించుకొని కైవల్య ధామానికి చేరే మార్గాన్ని తెలిపే జీవన యాత్రా మార్గదర్శి 'గిరిధారి'.

కష్టాల్లో పుట్టిన పత్రిక 'గిరిధారి'
కన్నీళ్ళతో పెరిగిన నా పుత్రిక 'గిరిధారి'.

అమ్మాయి అందచందాలకు కొదవలేదు. అందరూ మెచ్చే లాగ ఉంది. నచ్చే లాగ ముస్తాబై ఉంది. తన కంటూ దాచింది పదహారు వేలు ఉండనే ఉంది.
ఎలా నడుస్తుందో!
రేపు ఎలా గడుస్తుందో! అనే బాధ లేదు. ఎలా బ్రతుకుతుందో! అనే బెంగ లేదు.
సొగసైన పత్రిక
సుగుణాల పుత్రిక - ఎలాగైనా హాయిగా బ్రతికేస్తుంది. పంపడమే నా పని. పోయిన చోట పసిడిలా శోభిస్తుంది.

పురిటి నొప్పుల నుండి పెళ్ళిపీటల వరకు పుట్టినింటిలో అన్నీ కష్టాలే అయినా, మెండైన సొగసుతో, నిండైన సంపదతో మెట్టినింటిలో సాటిలేని మేటి అనిపించుకుంది. కన్నీళ్ళతో కుమిలిపోతూ బండెక్కినా, దిగేచోట కళకళ లాడుతూ కాలు పెట్టింది. తనతో పాటు దివిని కూడా భువికి దించేసింది.

కని, పెంచినందుకు ఫలితం కనిపించింది.
తినిపించింది బాగుందని చెవికి వినిపించింది. ఇంకా ఏం కావాలి?

నిండు జాబిలి లాగా ఎందరో జీవితాలను దండిగ పండించిన 'గిరిధారి' మాసపత్రిక ఈ సంచికతో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్నది.

పెద్ద స్థాయి కలిగిన చిన్న పత్రిక గిరిధారి
చిన్న పెద్ద తేడా తెలియని వన్నె పత్రిక గిరిధారి



అన్ని హంగులున్న అందాల పత్రిక గిరిధారి
శ్రమతో పెరిగిన ఆశ్రమ పత్రిక గిరిధారి

అధ్యయనానికి అనువైన పత్రిక గిరిధారి
ఆదాయము లేని ఆదర్శ పత్రిక గిరిధారి

సంపాదనే ఎరుగని సిరి గల పత్రిక గిరిధారి
కూడిన వారిని దరి చేర్చే పత్రిక గిరిధారి

కైవల్య మొసగే కామాక్షి గిరిధారి
వాణీ విలాసాల మాగాణి గిరిధారి
నెల నెల కాసే చల్లని వెన్నెల గిరిధారి
నెల అంతా కాసే అసమాన కళ గిరిధారి

అంబర విభవాన్ని అవనికి దించింది గిరిధారి
భూమాత తలలో జాబిల్లిని తురిమింది గిరిధారి

అవని తలముపై తిమిరాన్ని తరిమింది గిరిధారి
తెలుగు గుండెలలో వెలుగులను నింపింది గిరిధారి

నేల మారినా
నెలవులు తప్పినా
వత్సరాలు దొరలినా
నిరుత్సాహ మెరుగని నిత్య సౌభాగ్యవతి గిరిధారి
అసమాన సౌందర్య అపురూప కళావతి గిరిధారి

గ్రంథాలు గుట్టలై పడుతున్నా ఆరని సిరాయే పత్రిక రక్తం
అవరోధాలు ఎదురౌతున్నా అవిద్య అంతం చూడా లనేదే తన పంతం

ఏది పలికినా, ఎలా పలికినా పద పదము వేదోక్తం
మాట కదిలినా, పాట కులికినా ఏదైనా అది ఋషిప్రోక్తం

పలికే పదాలతో
కులికే వాక్యాలతో

పాడే గీతాలలో
దోగాడే భావాలతో - ఎక్కడ చూచినా, ఏది స్పృశించినా
వాక్యాలలో ఒదిగిన తియ్యని పలుకులే గాని
పలుకుల కొరకు కదిలిన వాక్యాలు లేని వేదాల ఒరవడి గిరిధారి
సరస రాగాల సవ్వడి గిరిధారి
మాసం మాసం
తీర్థంలా పోస్తూ ఉన్నా
వర్షంలా కురుస్తూ ఉన్నా
అరగని గిరి గిరిధారి
తరగని సిరి గిరిధారి.



ఆత్మబంధువులారా!

నాకు చేతనైన దంతా చేతులు నొప్పి పుట్టే లాగా చేశాను. మీ అందరి ఉత్సాహ ప్రోత్సాహాలు నాకు నిరంతరం తోడుగా నిలిచాయి.
వేడుక లెన్నో చూశాను. వేదన లెన్నో చవి చూశాను. వెన్నునికి నా వేడుకోలును ఎంత గానో 'గిరిధారి' ద్వారా వినిపించాను. ప్రస్తుతం మీ నుండి వీడుకోలు తీసుకుంటున్నాను.

'గిరిధారి' నేను నాటిన మొక్కే అయినా
మీరందరూ శ్రమించి పెంచారు.

నేడు కొండంత ఎత్తుగా
ఆకాశమంత విశాలంగా
సంద్రమంత గంభీరంగా 'గిరిధారి' తయారైంది.

కలత చెందిన బాటసారులకు
కల్పతరువుగా ముందు నిలిచింది.

నాలుగు దశాబ్దాలు ఏక బిగిన పత్రికను నడిపినందుకు ఎంతగానో సంతసిస్తున్నా. అందరికీ చల్లని నీడ నిచ్చే ఈ 'గిరిధారి'ని మీరందరూ మున్ముందు కూడా చల్లగా కాపాడుకుంటా రనే విశ్వాసంతో వీడ్కోలు తీసుకుంటున్నా.

సర్వం శ్రీకృష్ణార్పణ మస్తు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః


ఆశ్రమం
హైదరాబాద్
22-10-2025

ఓం స్వామి సుందర చైతన్యానంద

వృథా చేయబోకు!

(చైతన్య గానం - 11) **శ్రీమతి సి.పద్మ**

పల్లవి: **వృథా చేయబోకు**
జన్మము సదా రాదు నీకు
ఈ జన్మము సదా రాదు నీకు ॥ వృథా ॥



చరణములు:

1. **ఉత్తమ జన్మమురా దీనిని వ్యర్థము చేయకురా**
ఉత్త సంసారమురా రేపది మృత్యురూపమౌరా ॥ వృథా ॥
2. **ఏవేవో చదివి ఊరక వాదులాడబోకు**
సాధు సేవ లేక రేపది బోధకు రాబోదు ॥ వృథా ॥
3. **మూడు గుణంబులలో నీవు ముక్తుడ గారాదా**
పాడు ఘటము కాదా రేపది భస్మమై పోదా ॥ వృథా ॥
4. **అంతా నటనేరా ఈ లోకము నరకము చూపునురా**
పెద్దల మార్గములో నడచి సిద్ధిని బొందుమురా ॥ వృథా ॥

పవిత్రమైన పరమాత్మ సృష్టిలో వ్యర్థమైనది కించిత్తైనా లేదు. ప్రతిదీ ఎంతో అర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా ఉంది. ఏదైనా ఎక్కడైనా వృథా అయింది అంటే అది కేవలం మానవుడి యొక్క వివేక రహితమైన వినియోగమే అని అర్థం. ఏదైనా ఇచ్చేవాడు పరమాత్మే. పుచ్చుకునే వాడూ పరమాత్మే. మధ్యలో వినియోగమే మానవుడిది. పరమాత్మ ఇచ్చిన పూలను పరమాత్మకు సమర్పించి పుణ్యం మూట కట్టుకున్నట్లు, పరమాత్మ ఇచ్చిన జన్మను పరమాత్మను చేరేందుకు సాధనగా ఉపయోగించుకొని జన్మను సార్థకం చేసుకోవాలి. ఇవ్వబడిన వన్నీ ఇచ్చినవాడిని గుర్తు చేసేందుకే ఉన్నాయి. ఇచ్చిన వన్నీ పుచ్చుకొని ఇచ్చిన వాడినే మరచిపోవడం స్వార్థం. స్వార్థ పంకిలంలో కూరుకుపోయినవాడు పరమార్థాన్ని గుర్తించే ప్రసక్తి లేదు. ప్రపంచంలో సదా పరమాత్మనే వెతికే సంస్కారవంతుడు సంసార కూపంలో మునిగిపోయే ప్రమాదం లేదు.

తిరిగి రానిది కాలం. తిరుగ వ్రాయలేనిది లలాట లిఖితం. ప్రారబ్దంతో కలిసి పుట్టిన మనిషి మరికొంత ప్రారబ్దాన్ని మూట గట్టుకొని ప్రపంచం నుండి జారిపోతాడు. ఈ చావుపుట్టుకల చక్రభ్రమణంలో మనిషి ప్రయాణం ముందుకో వెనుకకో అర్థం కాదు. మరల మరల కర్మలు చేస్తూ, మళ్ళీ మళ్ళీ పుడుతూ చస్తూ, మనిషి సాధిస్తున్న ఘనత ఏమిటో అంతుపట్టదు. అన్ని జన్మలు ప్రారబ్ద ఫలాలే అయినా, గురువును చేరిన జన్మమే పుణ్యఫలము.

పుట్టింది మొదలు బిడ్డ ఆరోగ్యంగా పెరగాలి, ఆయుష్మంతుడు కావాలి అని తల్లి ఆరాటం. పెరిగి పెద్ద చదువులు చదవాలి, ప్రయోజకుడు కావాలి అని తండ్రి ఉబలాటం. జయాపజయాల మధ్య, లాభనష్టాల మధ్య జీవి పోరాటం. ఆది నుండి అంతం వరకు జన్మ అంతా ఇంతే. తల్లిదండ్రుల వల్ల జన్మ ప్రాప్తించింది. మోక్షసాధన మైన జన్మను ప్రసాదించినందుకు తల్లిదండ్రులు సదా పూజనీయులు. కాని లలాట లిఖితాన్ని చెరిపేసి, అజ్ఞాన చీకటిని తరిమేసి, జన్మ పరంపరలకు తెరదించే గురుదేవుడు శిష్యుల పాలిటి ఇలవేలుపు. ముముక్షు లోకానికే కల్పతరువు. దేహం పెరిగినంత మాత్రాన సరిపోదు. సిరిసంపదలు వచ్చినంత మాత్రాన సరికాదు. పెరిగేది ఏదైనా తరిగేందుకే. వచ్చేది ఏదైనా పోయేందుకే. రాకపోకలు లేనిది, హెచ్చుతగ్గులకు లొంగనిది, ఎప్పుడూ నీతో ఉన్నది, నీవు గానే ఉన్నది ఏదో దానిని వెతికి పట్టుకునేందుకే జన్మము అని గుర్తు తెలిపే గురుదేవుని ఆశ్రయించిన జన్మమే ధన్యము. అందుకే,

వృథా చేయబోకు, ఈ జన్మము సదా రాదు నీకు అంటూ, ఎప్పటికీ దారి లోనే తారాడేవాడు గమ్యాన్ని ఎన్నడూ చేరలేడు. జన్మ వచ్చింది కేవలం జీవించడం కోసం కాదు, జీవిస్తూ జీవన గమ్యాన్ని గుర్తించేందుకే అని వెన్ను తట్టి కర్తవ్యాన్ని బోధిస్తున్నారు పూజ్య గురుదేవులు.

పాపపుణ్యాల యొక్క మిశ్రమ ఫలమే మానవ జన్మము. పరమ పురుషార్థమైన మోక్షానికి సాధనం కనుక ఇది అన్ని జన్మల లోకి ఉత్తమ జన్మము. పసిబిడ్డ నోటిలో బొటనవ్రేలు వేసుకొని తన లాలాజలాన్నే పాలనుకొని పానం చేసిన విధంగా, సుఖం తన స్వరూపం కాగా అది సంసారం నుండి లభ్యమవుతుందన్న భ్రాంతిలో జన్మలను వృథా చేసుకుంటూ ఉన్నాడు మానవుడు. సంసారమే గనుక సుఖస్వరూప మైతే అది దుఃఖాన్ని ఎందుకు పంచుతూ ఉందో ఆలోచించడు. ఉన్నన్నాళ్ళు దుఃఖాన్ని పంచి చివరికి దహించుకు పోయేది దేహం. దేహం మరణిస్తే మరొక దేహం ప్రాప్తిస్తూ ఉంది. మరల మరల మనలను మృత్యుకూపంలో పడదోస్తూ ఉంది. జ్ఞానం కలిగి సంసారం సమూలంగా నశించగా, జననమరణ చక్రాన్ని ఛేదించుకొని జీవుడు మృత్యుంజయుడు అవుతున్నాడు. అమృత స్వరూపుడై వెల్గొందుతున్నాడు. అందుకే,

ఉత్తమ జన్మమురా దీనిని వ్యర్థము చేయకురా
ఉత్త సంసారమురా రేపది మృత్యురూపమౌరా

అంటూ ప్రతి పుట్టుకకు చావే గమ్యం కాగా చావు పుట్టుకలు చేరని పరంధామానికి జ్ఞానమే నిచ్చెన అంటున్నారు పూజ్య స్వామిజీ.

ప్రపంచంలో ఏ చదువైనా చదువరి కన్నా వేరైనదే. వ్యక్తిలో తనకు సంబంధించిన అజ్ఞానం పోవాలంటే తనకు సంబంధించిన జ్ఞానమే రావాలి. ఇదే స్వరూప జ్ఞానం. స్వరూప జ్ఞానాన్ని కలిగించేది ఒక్క ఆధ్యాత్మ విద్యయే. ఎంత పాండిత్యం ఉన్నవారైనా శాస్త్ర వచనాల యొక్క వాచ్యార్థాన్ని గ్రహించగలరే గాని లక్ష్యార్థాన్ని గ్రహించలేరు. ఒక్క శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన సద్గురువే వేదాంత వాక్యాల యొక్క లక్ష్యార్థాన్ని వివరించి శాస్త్రలోతుల్ని

శిష్యుడికి సుగ్రాహ్యం చెయ్యగలడు. సద్గురువు ద్వారా బోధను విన్నా సిద్ధం కాని మొగ్గ విచ్చుకోలేనట్లు, శుద్ధి పడని బుద్ధి అనుభూతిని పొందలేదు. గురుసేవలో రాగద్వేషాలు నిర్వీర్యమై హృదయం ప్రసన్నత నొందగా, అంతవరకూ విన్న పరోక్షజ్ఞానం అపరోక్షానుభూతిగా మారుతూ ఉంది. అందుకే,

ఏవేవో చదివి ఊరక వాదులాడబోకు
సాధు సేవ లేక రేపది బోధకు రాబోదు ॥

అంటూ, శుష్క వేదాంతం వితండ వాదానికే గాని వ్యక్తి తాను ఆశించే అనంతానందాన్ని అందుకొనేందుకు కాదు. ఆత్మ నేను అయ్యే ఉన్నాను అని తెలిసి తృప్తి చెందేందుకే ఆత్మజ్ఞానం ఉంది. అంతేకాని, ఆత్మను తన కన్నా వేరుగా వర్ణించి, వివరించి వాదించేందుకు కాదు అంటున్నారు పూజ్య స్వామీజీ.

తమస్సు, రజస్సు, సత్త్వం - ఒక దాని కన్నా ఒకటి మిన్న అయినా అన్నీ ప్రకృతి సిద్ధమైన గుణాలే కనుక అన్నీ మాయాకార్యాలే. ఈ త్రిగుణాలు జీవుణ్ణి దేహంలో బంధించి, కర్మలలో దించి, కర్తృత్వ భోక్తృత్వ భావనలతో అజ్ఞానాన్ని పెంచి, దుఃఖంలో ముంచేవే. గుణాలు తన కన్నా అన్యమని గ్రహించి, గుణప్రేరితమైన కర్మలకు తాను సాక్షి మాత్రమే నని తెలిసి, అహం అకర్త, అహం అభోక్త అనే జ్ఞానంలో వెలిగేవాడే జీవన్ముక్తుడు. అందుకే,

మూడు గుణంబులలో నీవు ముక్తుడ గారాదా
పాడు ఘటము కాదా రేపది భస్మమై పోదా ॥

జీవన్ముక్తుడు దేహం ఉన్నప్పుడూ దేహానికి పరిమితమైనవాడు కాడు. అలలు లేచినా, పడినా సముద్రం పూర్ణం గానే శోభించినట్లు, దేహం ఉన్నా, రాలిపోయినా, కాలిపోయినా జ్ఞాని అఖండస్వరూపంగా వెల్గొందుతూ ఉంటాడు అనే పూర్ణబోధను గురుదేవులు ఈ చరణంలో మనకు అందిస్తూ ఉన్నారు.

ఈ ప్రపంచంలో అందరినీ మెప్పించడం ఎవరి వల్లా కాదు. ఏ ఒక్కరినీ నొప్పించకుండా మనుగడను సాగించడం సాధ్యపడదు. ఈ రోజు ప్రేమించేవారు రేపు ద్వేషించవచ్చు అనేది చేదు నిజం. ఎవరిని ప్రేమించినా అది మన మీద ప్రేమ కొద్దే అనేది పరమ సత్యం. ప్రాణ మున్నంత వరకు ప్రాణతుల్యంగా ప్రేమించే వారు ప్రాణం పోగానే శవాన్ని వదిలి పారిపోతారు అనేది నగ్న సత్యం. ఇవన్నీ సత్యాలే కాని వ్యవహారిక సత్యాలే. సత్యాసత్యాలకు అతీతమైన ఆత్మయే పారమార్థిక సత్యం. అందుకే,

అంతా నటనేరా ఈ లోకము నరకము చూపునురా
పెద్దల మార్గములో నడచి సిద్ధిని బొందుమురా ॥

మహర్షుల మార్గంలో పయనించేందుకు, సత్యాన్వేషణలో ఫలించేందుకు వచ్చిన అరుదైన మానవ జన్మమును 'వృథా చేయబోకు, ఈ జన్మము సదా రాదు నీకు' అంటూ హృదయ తంత్రులను మెల్లగా మీటుతూ జీవన సత్యాలను వెన్నెలలా ఆరబోస్తూ పాటనే జీవనబాటగా మలచారు పూజ్య స్వామీజీ.

జై జై గురుదేవ!

జగద్గురు జీవితము

ధారావాహిని-7

స్వామి సుందర చైతన్యానంద

మరణశయ్యపై మాతృదేవి

దిగ్విజయ యాత్ర సాగిస్తూ శృంగేరి క్షేత్రం చేరారు శ్రీ శంకరులు. ఒకనాడు ఆ మహాత్ముడి హృదయం కలవరపడ సాగింది. ఈ నిర్హేతుక నైరాశ్యానికి కారణాన్ని దివ్యదృష్టితో దర్శించారు ఆచార్యులు. తీవ్ర అస్వస్థతతో తల్లి బాధ పడుతున్నది.



ఆర్యాంబకు అంతిమ క్షణాలు దగ్గరయ్యాయి. ఇంటిని త్యజించే సమయంలో మాతృమూర్తికి సమర్పించిన మాటను సంరక్షించుకో వలసిన సమయం ఆచార్యులను సమీపించింది. ప్రతిజ్ఞ హృదయంలో ప్రతిధ్వనిస్తున్నది. తల్లిని చేరేందుకు సిద్ధ మయ్యారు శంకరులు. తమ యోగశక్తి ద్వారా క్షణాలలో కాలడి చేరారు.

అవనికి దూర మయ్యేందుకు సిద్ధంగా ఉన్న ఆర్యాంబ ఆచార్యులను చూసి ఆనందంతో పరవశించింది. తనయుడు తల్లిని వదలి నేటికి ద్వాదశ వర్షాలు గడిచాయి. ఆచార్యులు అమ్మను సమీపించారు. తల్లి నేత్రాలు వర్షాకాల మేఘాలై అశ్రువులను వర్షింప సాగాయి. మాతృదేవి మరణశయ్యపై ఉంది. మహేశ్వరుడు సమీపంలో ఉన్నాడు. కాలడి కాశీక్షేత్ర మైంది.

శంకరులు తల్లిని ఓదార్చారు. జ్ఞానోపదేశం చేశారు. ప్రాణదాత సమక్షంలో ప్రాణాలు త్యజించడానికి ఆర్యాంబ సిద్ధ పడింది. రెప్పలు ఏ క్షణా న్నైనా వాలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

శ్రీ శంకరులు శివుని స్తుతించారు. జన్మ ఇచ్చిన తల్లికి జన్మరాహిత్యం ప్రసాదించాలని సంకల్పించారు. ఆర్యాంబను తీసుకుని పోవడానికి కైలాసం నుండి శివపార్షదులు వచ్చారు. శివదూతల భయంకర రూపాలను చూసి ఆర్యాంబ భయ పడింది. తల్లి మనస్సు ఎరిగిన శంకరులు శివదూతలను పంపి వేసి, ఆ తరువాత విష్ణుమూర్తిని ధ్యానించారు. శంకరుల ప్రార్థన ఫలించింది. వైకుంఠం నుండి విష్ణు దూతలు వచ్చారు. శంకరుల తల్లి కృష్ణ భక్తురాలు. విష్ణుపార్షదులను చూసి సంతృప్తిని వ్యక్త పరిచింది. దృష్టిని కృష్ణునిపై ఉంచి సృష్టికి దూరమైంది ఆర్యాంబ. జగద్గురువును ప్రసాదించిన జనని జగత్తునకు ఇక లేదు.

తల్లికి అంత్యక్రియలు జరిపేందుకు సిద్ధ మయ్యారు శ్రీ శంకరులు. మృతదేహం వద్దకు ఎవ్వరూ రాలేదు. బంధువులు బిగిసి పోయారు. చుట్టాలు కట్టుబాటు లంటున్నారు. అనుయాయులు లేకుండా అంత్యకర్మ ఎలా జరుగుతుంది?

శంకరులు బంధువులను బ్రతిమాలారు. పొరుగు వారిని ప్రాధేయ పడ్డారు. ప్రార్థించారు. శంకరుల అభ్యర్థనలు ఎవనీ స్పందింప జేయలేక పోయాయి. శంకరుల ప్రార్థనలను సర్వులూ తిరస్కరించారు. అంత్యక్రియలకు వెళ్ళకూడ దని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

సన్యాసి అయిన శంకరులు తల్లికి అంత్యకర్మ నిర్వర్తించటం శాస్త్రరీత్యా నిషిద్ధ మని వారి అభిప్రాయం. శంకరులను ఆశ్రమ భ్రష్టులుగా వారు చిత్రించారు. సన్యాసి తల్లికి అంత్యక్రియలను నిర్వహించటం అధర్మ మని వారి అభిమతం.

ఆహా! దయారహిత పైశాచిక సమాజమా! తోటి మనిషిపై జాలి కూడా లేక నిర్దాక్షిణ్యంగా హింసించే నికృష్ట సంఘ జీవనమా? శ్మశాన వాటికలో కూడా మానవుల పాషాణ హృదయాలు ద్రవించవా? ధర్మ శాస్త్రాలను అభివృద్ధికి సోపానాలుగా గుర్తించక పోగా నిస్సహాయుల భుజాలపై ఎక్కి స్వారి చేయడానికి ఉపయోగించే పరికరాలుగా మలుచుకొన్న దౌర్భాగ్య సంఘమా!

కనికరమే లేని కాఠిన్య హృదయాలు కైవల్యం చేరుతాయా? మంచిని వంచించే నరరూప రాక్షసులు ధర్మ నిర్వాహకులా! కాదు. ధర్మం పేరిట చెలామణి అయ్యే అధర్మపరులు, మతం పేరిట మనుగడ సాగించుకునే మందమతులు. తమ స్వార్థానికి శాస్త్రాలను అనుపానాలుగా స్వీకరించే దుర్మార్గులు. మంచిని వంచించి, మమతలను కాలరాసి మారణహోమాలు సృష్టించి, ఆచారాల ముసుగులో సమాజ వికాస వృక్షాన్ని కూకటి వేళ్ళతో సహా పెకలించి భగవంతుని దృష్టిలో నీచులుగా, వ్యర్థ జీవులుగా చిత్రింపబడిన నరరూప రాక్షసులు.

చెట్టు వీడిన పక్షిలా తల్లిని పోగొట్టు కొని మృతదేహం వద్ద ఏకాకిగా నిలబడి ఉన్న శంకరులను చూసి ఒక్క హృదయం కూడా ద్రవించ లేదు.

శంకరులు తల్లిని చూశారు. పుణ్యకార్యాలు అందరూ చేయ లేరు. పుణ్యాత్ములే చేయ గలరు. ఆచార్యులు అమ్మకు నమస్కరించారు. తమ ఇంటి లోని పెరడునే శ్మశానవాటికగా నిర్ణయించారు. పెరడులో అరటిచెట్లు మాత్రమే ఉన్నాయి. పచ్చని అరటిచెట్టు పెకలించి అంత్యకర్మకు శయ్యను తయారు జేశారు. తల్లి మృతదేహాన్ని అరటిశయ్యపై ఉంచారు. చేతులు జోడించి అగ్నిదేవుని ప్రార్థించారు. తనకు ఈ అవకాశం లభించి నందుకు అగ్నిదేవుడు పొంగి పోయాడు. తన జ్వాలలచే ఆమె దేహం అదృశ్యం చేశాడు. ఆర్యాంబ అదృశ్య మైంది. ఆదిశంకరులకు జన్మ ఇచ్చిన తల్లిగా శాశ్వతంగా నిలిచి పోయింది.

(సశేషం)

నిత్యార్చన

స్వామి సుందర చైతన్యానంద

పూజలో ఏది సమర్పించినా దానిని అందుకోవలసింది భగవంతుడు. అందించ వలసింది భక్తుడు. అందించబడేది భక్తి.



విగ్రహారాధనలో అర్చకుడు పూజించేది విగ్రహాన్ని కాదు; భగవంతుని. స్థూలంగా విగ్రహాన్ని పూజిస్తూ ఉన్నట్లు కనిపించినా, అతని మనసులో భగవంతుడు ఉన్నాడు అనే విషయాన్ని విస్మరించలేము. దూరదేశంలో ఉన్న ఆత్మీయుని ఫోటోలో చూచినపుడు మన మనసులో నిలిచి ఉండేది ఆ ఆత్మీయుడే. ఆరాధనలో కూడా అంతే.

ఈ విషయాన్ని మరొక కోణంలో పరిశీలిద్దాం. అర్చన జరిగేసమయంలో మనసు అక్కడ లేకుండా పోయిందనుకోండి. ఎందుకు లేకుండా పోతుంది? అని ఎదురు ప్రశ్న వేయకండి. ఒకచోట నిలబడకుండా చరించేదాన్నే మనసు అంటారు. కనుక మనసు పూజలో లేకుండా పోవడం విశేషము కాదు. విషయము.

అలా మనసు మరొకచోట ఉండి విగ్రహము ముందు పూజ జరిగితే, పూజ జరుగవచ్చునేమో కాని అది మనసు లేని పూజ. బుద్ధిలేని పూజ. బుద్ధిలేని పూజలో భగవంతుడు లేడు. అక్కడ అంతా యాంత్రికమే. మంత్రము కూడా నాలుకమీద ఉండేకాని మనసులో లేదు.

మనసులో భక్తి ఎప్పుడు లేదో పూజాగదిలో ఉండేది మానవుడు కావచ్చు. కాని, భక్తుడు మాత్రం లేడు. చెరువే లేనపుడు నీళ్ళెక్కడివి? భక్తుడే లేనపుడు ఇక భక్తి ఏమిటి? భక్తి, భక్తుడు లేని పూజలో భగవంతుని పాత్ర ఏమిటి?

ఇప్పుడు అర్థం చేసుకోండి. మనం గంటసేపు పూజ చేసినా, జపం చేసినా మనసు ఉన్న నిముషాలే పూజావేళలు. మిగిలిన సమయంలో పూజలు లేవు. అన్నీ పచార్లే.

స్తోత్రం చేయవచ్చు. భగవంతుని స్తుతించడము అంత తేలికైన పని కాదు. భగవంతుని వైభవాన్ని కీర్తించడము అంటే భగవంతుని గూర్చి తెలిసి కీర్తించడము అని భావము. భగవంతుణ్ణి తెలుసుకోవడమంటే అతని అనంత స్వరూపాన్ని గ్రహించడము అని అర్థము. అనంతుడు అంతటా ఉంటాడు. అంతటా ఉండేవాణ్ణి ఎలా చూడడము? అంతటా ఉన్నవాణ్ణి వీక్షించడమనేది అంతటా వ్యాపించిన వానికే సాధ్యమవుతుంది. అంతటా వ్యాపించి యున్నవాడు ప్రత్యేకించి చూడడానికి ఎవరున్నారు? ఒకవేళ చూచినా తననే తాను చూచుకోవాలి. ఎలా? భక్తుడుగా కాదు. భగవంతుడుగా.

కనుక ఇక్కడ చూడటము కాదు; తెలుసుకోవడం. కనుక జ్ఞానము ప్రధానమైన విషయంగా తెలుస్తోంది. అనంతుడైన పరమాత్మను నీవు చూడలేవు. తెలుసుకోవాలి. అనంతుని అనంతునిగా తెలుసుకోవాలే గాని పరిమితుడుగా తెలుసుకుంటే ఉపయోగం లేదు.

పరిమితుడైన వానినుండి అనంతానందము లభ్యంకాదు. అంతం కలిగిన సుఖాల కొరకైతే భగవంతునే ఆశ్రయించనవసరం లేదు. అర్థం చేసుకోండి. పరమాత్మ విగ్రహానికే పరిమితమైతే, అతణ్ణి పూజించి నీవు సాధించేదేమీ ఉండదు. అంతటా ఉన్నాడని తెలిసి అతణ్ణి విగ్రహంలో చూస్తే తప్పులేదు. ఎందుకని? అంతటా ఉన్నవాడు విగ్రహంలో లేకుండా ఎలా ఉంటాడు? అంతటా భగవంతుడు ఉండటమంటే ఈ సృష్టిలో పరమాత్మ నిమిత్త ఉపాదాన కారణమైయున్నాడు. ఇది నీకు అర్థం కావాలి. అప్పుడే పరమాత్మ చిరునామా నీకు దొరుకుతుంది. అంతవరకు అన్నీ నామాలే. జ్ఞానం మాత్రం లేదు. జ్ఞానం లేనివానివద్ద వంద ఉంటే ఏమి? వేయి ఉంటే ఏమి? చిన్నబిడ్డ చేతిలోఉండే కరెన్సీనోటు పది రూపాయలైనా, వంద రూపాయలైనా ఒక్కటే. విలువ తెలియని వ్యక్తివద్ద ఏదున్నా భూషణంగా పనికొస్తుందేమో గాని భాషణానికి పనికిరాదు. చిన్నబిడ్డ అయిపోయె - విలువ ఎలాతెలుస్తుంది? పేరుముందే 'చిన్న' చేరిపోయె. ఇక, పెద్ద విషయాలెలా తెలుస్తాయి? చిన్న బుద్ధులు, చిన్న చిన్న బుద్ధులే ఉంటాయి.

కనుక పరమాత్మ ఏమిటో తెలియకుండా పరమాత్మను పూజిస్తే అది పరమాత్మ కెలాచేరుతుంది? చిరునామా వ్రాయకుండా ఉత్తరాన్ని తపాలాపెట్టెలో పడేసినట్లు, పరమాత్మ పవిత్ర చరణాలవద్ద పూలు పడేస్తే అవి అతనికి ఎలా అందుతాయి? చిరునామా ఉంటేనే ఉత్తరం చేరేది. భక్తి ఉంటేనే పూజ ఫలించేది.

పూజ కూడా పనే. భక్తి తోడైనపుడే అది అర్చన అవుతుంది. యోగమవుతుంది.

అంతవరకు జరిగేవి పనులే కాని పూజలు కావు. ధ్యాసలే గాని ధ్యానాలు కావు. ధ్యానమంటేనే తెలియదు కనుక "ధ్యాసే ధ్యానము" అని కొందరు చిలుక పలుకులు పలుకు తుంటారు. చిలుక మాటలు ఉండేది విని నవ్వుకొనేందుకే గాని, విషయ గ్రహణానికి కాదు. "ధ్యాసే ధ్యానము" అంటూ ఇంపుగా సొంపుగా యతిప్రాసలు వాడామని వారు తృప్తి చెందవచ్చు. అక్కడ ప్రాసము ఉంటే ఉండొచ్చునేమో గాని యతి మాత్రం లేనట్లే. యతి గాలేని మతికి స్వరూపస్థితి తెలిసిరాదు. తెలియనపుడు పనులుంటాయే గాని పూజ లుండవు. తెలిసి చేసినపుడే భక్తి. కనుకనే భక్తిని స్వస్వరూపాను సంధానంగా నిర్వచించారు వివేక చూడామణి గ్రంథంలో శ్రీ శంకరాచార్య స్వామి.

జ్ఞానము కలిగితే ఆ వైపునకు ప్రేమ ప్రవహించకుండా ఉండలేదు. ఇంట్లోఉన్న బిడ్డకు ప్రేమతో తల్లి మిఠాయిలు పెడుతుంది. అతడు దూరదేశం వెళ్తే మిఠాయిలు పెట్టలేక పోవచ్చునేమోగాని ప్రేమించకుండా ఉండలేదు. ప్రేమతో కార్యాలు జరుగవచ్చు. కార్యాలు లేనంత మాత్రాన ప్రేమ ఇంకిపోదు.

పరమాత్మ జ్ఞానము నీకు కలిగితే నీ హృదయంలో ప్రేమ నిండుకుంటుంది. ఆ ప్రేమే భక్తి. అందుకే! **'సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా'** అంటూ పరమాత్మ యందలి ఉత్కృష్టమైన ప్రేమను భక్తిగా నారదమహర్షి భక్తిసూత్రాలలో నిర్వచించారు.

సృష్టికి పరమాత్మ నిమిత్త ఉపాదాన కారణమని తెలిసినపుడు సృష్టిలో సృష్టికర్త వేరుగా లేడు. ఇప్పుడు నీ వెక్కడున్నావు? అతనికన్నా వేరుగా ఉంటేమాత్రం నీవు ఎలా ఉన్నావో, ఏమై ఉన్నావో అది వేరే విషయం గాని పరమాత్మ ఉండడమనేది మాత్రం ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది.

సృష్టి రూపంలో పరమాత్మ ఉన్నప్పుడు నీవుగా ఉండేది కూడా అతడే. అతడే నీవుగా ఉండేటప్పుడు ఇక నీవేమిటి? కనుక నీవైనా ఉంటావు. లేదా అతడైనా ఉంటాడు. అలా నీవు అంగీకరించలేకపోతే అతడే నీవుగా గాని, లేదా నీవే అతడుగా గాని ఉంటారు. అంతేగాని నీవు, అతడు వేరువేరుగా ఉండి, పరస్పరము భేదించుకొంటూ, మనుగడను సాగించలేరు. కనుక నీవే అతడు. అతడే నీవు. ఇదే 'సో౽హం' మంత్రము.

'సో౽హం' మంత్రమయితే అది మననానికే ఉంది. మననం చేసేవాణ్ణి రక్షించేందుకే ఉంది. ఇది కూడా తెలియక నేను 'సో౽హం' జపం చేస్తున్నాను అంటారు. అది నామం కాదు జపించడానికి. సోహంలో సంధి ఉంది. సః అహం అనే రెండు పదాలు కలిసి 'సో౽హం' అయింది. 'సో౽హం' అంటే 'నేనే శివుణ్ణి' అని అర్థము. ఇది తెలుసుకోదగిందేగాని జపించదగింది కాదు. నీవు ప్రయత్నించి శివుడవు అయ్యేటట్లయితే 'సో౽హం' జపం చేయవచ్చు. ఇది సాధ్యం కాదు; సిద్ధం.

లడ్డు తియ్యగా ఉంటుంది. "నేను తియ్యగా ఉన్నాను. తియ్యగా ఉన్నాను" అని లడ్డు జపం చేయాలా? "నేను తీపిని" అని తెలుసుకుంటే సరిపోతుంది. లడ్డు జపం అవసరం లేదు. 'సోఽహం' కూడా అంతే.

ఇక్కడ అద్వైతాన్ని విమర్శించా లనుకొనేవారు సాగదీసి, కొండను త్రవ్వి గణపతిని కలవరపెడుతూ ఉంటారు. "చీమకు చక్కెరను తినడం ఆనందం. చీమే పంచదారగా మారిపోతే ఇక ఆనందాస్వాదన మేముంటుంది?" ఇది వారి పూర్వపక్షము.

చైతన్యంగా వెలగమని ఉపనిషత్తు చెబుతుంటే చీమగా, దోమగా ఉంటాను అనుకుంటే ఇక చేసే దేముంటుంది? జడమైన చక్కెరను సచ్చిదానంద స్వరూపంతో పోల్చినపుడే జరుగకూడనిదంతా జరిగిపోయింది. అదలా ఉంచండి. చక్కెరను తినడం చీమకు ఆనందం. చక్కెర లేనపుడు ఆనందం పోయినట్లే కదూ? చీమ ఆనందం మరొకదాని మీద ఆధారపడి ఉన్నట్లే కదూ! అదే నిజమైతే, అది పరిమితానందమే కదూ! అదే వాస్తవమైతే, ఇక మోక్షమనే పదానికి అర్థమేమిటి?

జ్ఞానం లేనపుడు ఉన్మాదాలే ఉపనిషత్తుల్లా కనిపిస్తాయి. జ్ఞానం కలిగితే ఉన్నదొక్కటే అనుభూతిగా మిగులుతుంది. ఇప్పుడు అంతటా ఉన్న అనంత పద్మనాభుని విగ్రహంలో దర్శించి పూజిస్తే తప్పులేదు. పూజ చేయనంతమాత్రాన జ్ఞానమున్న హృదయంలో అర్చన లేదని చెప్పకూడదు. అక్కడ జరిగేది నిత్యార్చన. ఇక ప్రత్యేక పూజ లెలా ఉంటాయి? ప్రత్యేక ధ్యానాలెలా ఉంటాయి? నిత్యమూ ధ్యానమే. సదా ధ్యానమే.

స్వయం తత్పాదుకా నిమజ్జనం పరిపూర్ణ ధ్యానమ్

"తాను పరమాత్మ చరణములయందు విలీనమైనట్లు భావించుటయే పరిపూర్ణ ధ్యానము" అన్నది ఉపనిషత్తు. ఇది పూజ కాని పూజ. ధ్యానం కాని ధ్యానం.



మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-6

స్వామి సుందర చైతన్యానంద

మండనమిశ్రుడు

శ్రీ శంకరులు ప్రయాగ నుండి బయలుదేరి ఆకాశము నంటి యున్న దివ్య భవనములతో శోభిల్లు మహిష్మతీ నగరమును చేరారు. నర్మదా నదీ తీరమున ఒక రమణీయమైన వనంలో విశ్రమించి ఆ తరువాత మండనమిశ్రుని కలియుటకు ఆచార్యులు బయలుదేరారు.

అది మధ్యాహ్నవేళ. తలలపై కుండలను ఉంచుకొని నీళ్ళకై రేవుకి వస్తున్న స్త్రీలను చూచిన శ్రీ శంకరులు 'మండనమిశ్రుని ఇల్లెక్కడ?' అని ప్రశ్నించారు.

'మీరు క్రొత్తవారుగా కనిపిస్తున్నారు. పండిత లోకానికి మండన మాన్యుడు, మీమాంసక మూర్ధన్యుడు అగు మండనమిశ్రుని తెలియని వారెవ్వరు? అయినా, అడిగిన వారు కనుక చెబుతున్నాము. వినండి' అంటూ పలికారు ఆ స్త్రీలు.

జగద్ధ్రువం స్యా జ్జగ దధ్రువం స్యాత్
కీరాంగనా యత్ర గిరం గిరన్తి ।
ద్వారస్థ నీడాంతర సన్నిరుద్ధా
జానీహి తన్మండన పండి తౌకః ॥

'జగత్తు నిత్యమా, లేక అనిత్యమా? అని ద్వారము కడ నుండు పంజరములలో బంధింపబడి యున్న ఆడు చిలుకలు ఎచ్చట చర్చించుకొనుచుండునో అది మండనమిశ్రుని భవనమని గ్రహించండి.

స్వతః ప్రమాణం పరతః ప్రమాణం
కీరంగనా యత్ర గిరం గిరన్తి ।
ద్వారస్థ నీడాంతర సన్నిరుద్ధా
జానీహి తన్మండన పండి తౌకః ॥

'వేదములు స్వతః ప్రమాణములా, లేక పరతః ప్రమాణములా? అని ద్వారము కడ నున్న పంజరములలో నిరోధింపబడి యున్న శుకాంగనలు ఎచ్చట విమర్శించు కొనుచుండునో అది మండనమిశ్రుని భవనము అని తెలుసుకోండి.

ఫలప్రదం కర్మఫల ప్రదోజః
కీరంగనా యత్ర గిరం గిరన్తి ।
ద్వారస్థ నీడాంతర సన్నిరుద్ధా
జానీహి తన్మండన పండి తౌకః ॥

'సుఖదుఃఖాది కర్మఫలములను ప్రసాదించునది కర్మయా, లేక పరమాత్మయా? అని ద్వారము నందలి పంజరములలో బంధింపబడియున్న సారికలు ఎచ్చట చర్చించుకొను చుండునో అది మండనమిశ్రుని భవనమని గ్రహించండి' అన్నారు నీళ్ళు తెచ్చుకొనుటకు రేవు కెళ్తున్న స్త్రీలు.

ఈ విధంగా మండన పండితుని చిరునామా శ్రీ శంకరులకు లభించింది. అయితే, స్త్రీలు చెప్పినట్లుగా మండనమిశ్రుని గృహం వద్ద పంజరములలో ఆడు చిలుకలు చర్చించుకుంటున్న మూడు విషయాలను పై మూడు శ్లోకాలలో తెలియ జేయడం జరిగింది. (1) జగత్తు నిత్యమా, అనిత్యమా? (2) వేదములు స్వతః ప్రమాణములా, పరతః ప్రమాణములా? (3) కర్మఫలాలను ప్రసాదించునది కర్మయా, లేక పరమాత్మయా? ఈ మూడు విషయాలను సంక్షిప్తముగా గ్రహించి ముందుకు వెళ్దాము.

(1) జగత్తు నిత్యమా, అనిత్యమా?

మీమాంసకుల దృష్టిలో జగత్తు సత్యము. కాని, వేదాంతుల దృష్టిలో జగత్తు కల్పితము లేదా ఆరోపితము.

జగత్తు సత్యమైతే అది నిత్యమై ఉంటుంది. నిత్యమైనది పూర్ణమై ఉంటుంది. పూర్ణమైన దానిలో కొరత ఉండేందుకు వీలు లేదు. ఇదే సత్యమైతే, జగత్తులో వసించే వారికి అసంతృప్తి ఉండేందుకు వీలు లేదు.

విచారణ చేసి చూస్తే జగత్తు అనేది బాహ్యంలో స్థిర మనుగడను కలిగినది కాదు. ఆంతర్యపు స్పందనలే జగత్తు యొక్క బాహ్యాకృతిగా తెలుస్తున్నాయి. ఆ స్పందనల ననుసరించి నడకను సాగిస్తే మనం ఊహించడానికి వీలు లేని, సర్వ ఊహలకు ఆధారమైన చైతన్యము అనుభూతిగా మిగుల్తుంది. ఇది వేదాంతుల నిర్ణయము. మీమాంసకులు చెప్పే జగత్సత్యత్వ వాదము నిత్యమైనదా? లేక వేదాంతులు చెప్పే జగన్మిథ్యత్వ వాదము నిత్యమైనదా? అనేది సారికల మీమాంస.

(2) వేదములు స్వతః ప్రమాణములా, పరతః ప్రమాణములా?

ఒక వస్తువును చూచినపుడు మనకు దానికి సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. ఈ జ్ఞానం రెండు విధాలు. ఒకటి సత్యజ్ఞానము, రెండు అసత్య జ్ఞానము లేదా మిథ్యా జ్ఞానము.

ఒక త్రాడును చూశాము. త్రాడు త్రాడుగా తెలియడం సత్యజ్ఞానము. త్రాడు పాముగా తెలియడం మిథ్యాజ్ఞానము. సత్యజ్ఞానము ఒక్కటే. కాని మిథ్యాజ్ఞానము రెండు రకాలు. (1) సంశయం (2) నిశ్చయం.

మిథ్యాజ్ఞానములో త్రాడు పాముగా తెలిసినపుడు ఆ భ్రాంతి సమయంలో అది

సత్యము గానే తెలిసి ప్రమాణం అనిపించుకుంటుంది. విచారించి చూడగా అక్కడ సర్పము లేదని రజ్జువే ఉన్నదని నిరూపించ బడుతుంది. ఈ సత్యదర్శన సమయాన మిథ్యా దర్శనములో ప్రమాణంగా గోచరించింది అప్రమాణంగా తెలుస్తుంది.

అయితే త్రాడును చూడగనే ఇది త్రాడు అనే జ్ఞానం కూడా కలుగుచున్నది. ఇది త్రాడు అనే జ్ఞానానికి త్రాడును చూచుటయే కారణమా, లేక మరొక దాని ప్రభావం చేత ఈ జ్ఞానము కలుగుచున్నదా? దీనికి త్రాడును చూచుటయే కారణము అనేది స్వతః ప్రమాణ వాదము. అలా కాకుండా మరొక దాని వలన మాత్రమే ఈ జ్ఞానము కలుగుతుంది అనడం పరతః ప్రమాణ వాదము.

వేదములు స్వతః ప్రమాణములు అని వేదాంతులు అంటారు. ఈ విషయములో మీమాంసకులు కూడా భిన్నంగా లేరు. వేద ప్రామాణికత్వ విషయములో మీమాంసకుల సిద్ధాంతము సుస్పష్టము గాను, విశిష్టము గాను ఉంటుంది. వేదము స్వయం ప్రమాణ భూతమని వారు భావిస్తారు. వేదము అపౌరుషేయము కనుక దాని ప్రామాణికత్వమును నిరూపించుటకు మరొక ప్రమాణము అవసరం లేదంటారు.

కానీ, న్యాయ వైశేషికములు ఈ విషయమున విపరీత ధోరణితో ఉంటాయి. వీరు వేదమును పౌరుషేయముగా భావిస్తారు. వేద ప్రామాణికత్వమును స్వాభావిక రూపంగా భావించరు. బయట ప్రమాణాలతో నిర్ణయిస్తారు. కనుక వీరికి వేదములు పరతః ప్రమాణములు. అయితే ఈ రెండు వాదాలలో ఏది సత్యము అనేది శుకాంగనల మీమాంస.

(3) కర్మ ఫలములను ఇచ్చేది కర్మయా, లేక పరమాత్మయా?

ఈ విషయంలో మీమాంసకులకు, వేదాలకు చాలా వ్యత్యాస ముంటుంది. కర్మలకు కర్మఫలాలకు మధ్య పరమాత్మ అవసరం లేదు. కర్మ యొక్క ఫలాన్ని కర్మే నిర్ణయిస్తుంది అనేది మీమాంసకుల వాదము. జడమైన కర్మ ఫలాన్ని ఎలా ఇస్తుంది? కర్మఫల ప్రదాత ఈశ్వరుడు అనేది వేదాంతుల నిర్ణయము.

మీమాంస మతములో వేదములను అపౌరుషేయంగా గ్రహిస్తారు. వేదవాక్కు వారికి శిరోధార్యం. వేదములు సూచించినట్లు కర్మాచరణము చేయడమే వారికి ప్రధానము.

మనం విత్తనము నాటాము. అది చెట్టైంది. ఫలము నిచ్చింది. ఆ ఫలము సుఖానికి కారణమైంది. ఈ విధంగా కర్మ కారణంగా ఫలం లభిస్తోంది. ఈ విషయంలో మధ్య ఈశ్వరుని ప్రసక్తి ఎందుకు? ఉంటే ఉంటాడు. లేకపోతే లేడు. వేదములు సత్య స్వరూపాలు. వేదజ్ఞానము అనూహ్యము. వేద ప్రతిపాదిత విషయాలను ఆచరణలో ఉంచుకోవడం లోనే మనకు సార్థకత లభిస్తుంది అంటారు మీమాంసకులు.

జగత్తును పరమాత్మ సృష్టించాడని వారు అంగీకరించరు. అలా సృష్టించడానికి కారణము ఏమిటి? అని ప్రశ్నిస్తారు.

న కదాచిత్ అనీదృశం జగత్

ఈ ప్రపంచం ఎప్పుడూ ఇలాగే ఉంది. మనం లేని కాలం ఉండవచ్చు. కాని జగత్తు అని సమయం లేదు. ఎప్పుడూ ఉండినదే కనుక సృష్టి అనే ప్రసక్తే లేదు. అలాగే ప్రళయ ప్రసక్తీ అసందర్భమే. అసంభవమే. ఇది మీమాంసకుల మతము. వీరు కర్మకాండనే ప్రధానంగా గ్రహిస్తారు. ఉపనిషత్తులను గ్రహించరు. వాటిని అర్థవాదంగా పలుకుతారు. కర్మాచరణకు ప్రాముఖ్యత నిస్తూ, సన్యాసాన్ని దోషంగా పరిగణిస్తారు. ఈ విధమైన తీవ్రమైన మీమాంస మతానికి సంబంధించిన వారు ముఖ్యులు. ఒకరు జైమిని. రెండవ వ్యక్తి కుమారిలభట్టు. మూడవ వ్యక్తి మండనమిశ్రుడు. ఇతనిని అన్వేషిస్తూ వచ్చారు శ్రీ శంకరులు. అతని గుమ్మం వద్ద పంజరములలో ఉన్న ఆడు చిలుకలు కర్మఫల విషయంలో మీమాంసలో పడి చర్చిస్తున్నాయి.

స్త్రీలు చెప్పిన వర్ణనను విని ముందుకు పోయి మండనమిశ్రుని భవనం ముందు నిలబడ్డారు శ్రీ శంకరులు. ప్రవేశించుటకు వీలుగాక, తలుపులు మూయబడి యున్న ఎత్తైన ఆ భవనమును చూచారు శ్రీ శంకరులు. అక్కడే యున్న ద్వారపాలకులతో 'మీ యజమాని ఎక్కడ? తలుపులు ఎందుకు బంధించినారు?' అని ప్రశ్నించారు ఆచార్యులు.

'మా యజమాని భవనము లోనే యున్నారు. శ్రాద్ధవిధిని నిర్వహిస్తున్నారు. ఎవ్వరినీ ప్రవేశపెట్ట వద్దని మాతో చెప్పారు. కనుక మేము ద్వారములను మూసి ఉంచినాము' అని ద్వారపాలకులు చెప్పారు.

మండనమిశ్రుని కలిసికొనవలె ననెడి ఉత్కంఠ ఆచార్యులలో ఎక్కువగా ఉండింది. నిషేధపు వార్త వారికి విచారమును కలిగించింది. యోగశక్తితో ఆకాశ మార్గము గుండా భవనము లోనికి ప్రవేశించారు శ్రీ శంకరాచార్యస్వామి.

(సశేషం)



మంగళ దీపాలు

ధారావాహిని-20

స్వామి సుందర చైతన్యానంద

అసమాన ప్రతిభ

శ్లో॥ క్షురధారాసు సంలగ్నం
యథా స్వాదయితే మధు ।
సుఖ మల్పం మహద్దుఃఖం
సంసారే౽

భావము :

పదునైన మంగలి కత్తిపై పూయబడిన తేనెను నాలుకతో నాకునపుడు క్షణ కాలము తీయగా తోచును. మరుక్షణము నాలుక తెగి అనంత దుఃఖము కలుగును. సంసారము లోని సుఖము కూడా అలాంటిదే. క్షణము సుఖము, బ్రతుకంతా దుఃఖము. ఇదియేనా సంసారము లోని సారము?

వ్యాఖ్య

సంసారమనే సాగరంలో విషయసుఖాలు తిమింగలాల వంటివి. వాటి బారి నుండి బయట పడటం కష్టం. ఇంద్రియ సుఖాలు శాశ్వతమని భావించే వారు ఎన్ని సాధన లాచరించినా సత్య తీరాన్ని చేరలేరు. రక్తపోటుతో బాధపడే వ్యక్తి ఎన్ని మందులు మింగినా ఉప్పును ఎక్కువగా వాడుతూ ఉంటే ఆరోగ్యవంతుడు కావడం మహా దుర్లభం. అలాగే, ఇంద్రియ విషయాల ననుభవిస్తూ ముక్తికి ప్రయత్నించడం కూడా వ్యర్థమే.

సంసారము లోని విషయ సుఖానుభూతి కత్తిపై పూయబడిన తేనె వంటిది అంటున్నారు. అది కూడా పదునైన మంగలి కత్తియని తెలుపుతున్నారు. తేనె తీయగానే ఉంటుంది. కానీ మరుక్షణమే నాలుక తెగిపోయే ప్రమాదం ఉంది. క్షణికమైన సుఖాల వెనుక భరించలేని బాధ నిలిచి ఉంటుంది.

సంసార సుఖాల యందు, భార్యాపుత్రాదుల ద్వారా లభించే సుఖం కూడా అలాంటిదే. అల్ప సుఖం, అనంత దుఃఖంతో సంసారం నిండి ఉంటుంది. విషయ సుఖాలు విషం కన్నా భయంకరమైనవి. ***విషయాన్ విషవ త్త్యజ.***

'విషయాలను విషము వలె త్యజింపుము' అని అష్టావక్ర మహర్షి తెలుపుతారు. విషము తినినపుడు మాత్రమే ప్రమాదాన్ని కలిగిస్తుంది. విషయాలు అలా కాదు. చూడగానే శక్తిని హరించి వ్యక్తిని నిర్వీర్యం చేస్తాయి. అందుచేత లోకంలో మెలుగుతూ ఉన్నా లోక వాసనలు మనలో చోటు చేసుకోకుండా చూసుకోవాలి. ***(29వ పేజీ చూడుము)***

రాజపోషకులు
రూ.5,000/-



శ్రీ శివ లింగయ్య, బెంగుళూరు | శ్రీమతి ఎస్.శాంతాబాయి, నిజామాబాద్ | శ్రీ కె.పి.లింగన్న, బషీరాబాద్ | శ్రీమతి జి.విద్యావతి, హైదరాబాద్ | శ్రీ కె.కిషన్ శాస్త్రి, ఆదిలాబాద్



శ్రీ వి.కృష్ణ చైతన్య, ఆర్మూరు | శ్రీ బి.హరిచరణ్, ఆదిలాబాద్ | శ్రీమతి యు.రజని, హైదరాబాద్ | శ్రీమతి కె.సత్యవతి, రాజమండ్రి | చి॥ జి.సోముప్రియ, హైదరాబాద్



శ్రీ సి.హెచ్.శివకుమార్, లాల్‌పురం | శ్రీ కె.శ్రీనివాస్, దౌలతాబాద్ | శ్రీ కె.హరికృష్ణ, హైదరాబాద్ | శ్రీ దావల్జీ విశ్వనాథ్, సిరిసిల్ల | శ్రీ ఎ.సంజయ్, ఆదిలాబాద్



శ్రీమతి వి.లక్ష్మీ నరసమాంబ, హైదరాబాద్ | చి॥ వి.రేయాన్ష్, ఖమ్మం | శ్రీమతి ప్రశాంతి, ఆస్ట్రేలియ | శ్రీమతి బి.హరిప్రియ, కరీంనగర్ | శ్రీ ఎన్.శ్రీనివాసరావు, హైదరాబాద్



శ్రీ ఎమ్.మోహన్ రెడ్డి, హైదరాబాద్ | శ్రీ బి.ఎస్.ఎన్.రాజు, హాలియ | చి॥ డి.అగస్త్య, అమెరికా | శ్రీమతి కె.లసుమ్‌బాయి, నిర్మల్ | శ్రీ కె.శ్రీహరి, హైదరాబాద్

యజ్ఞ పోషకులు



శ్రీమతి డి.సురేఖ, అమెరికా, రూ.3,00,000/- | శ్రీమతి ఎ.యశోదా శర్మ, హైదరాబాద్, రూ.1,00,000/- | శ్రీమతి బి.కామాక్షి, అమెరికా, రూ.1,00,000/- | శ్రీమతి పి.కళ్యాణి, శ్రీ పి.వీరబాబు, చి॥ వశిష్ఠ, అమెరికా, రూ.50,000/-

మహారాజ పోషకులు
(రూ.10,000/-)



డా॥ శ్రీమతి సుజని, డా॥ శ్రీ సి.అనంత్, హైదరాబాద్, రూ.25,116/- | డా॥ శ్రీ సి.హెచ్.మోహన్‌రావు, సికింద్రాబాద్ | శ్రీ టి.చంద్రమోహన్, ఖమ్మం | శ్రీ బి.కృష్ణమూర్తి, నెల్లూరు



శ్రీమతి ఆర్.శాంత, బెంగుళూరు | శ్రీమతి జి.వినోద, హైదరాబాద్ | శ్రీమతి కె.దేవిబాయి, హైదరాబాద్ | శ్రీమతి ఎ.నారాయణమ్మ, వైజాగ్



శ్రీమతి పి.నీలిమ, హైదరాబాద్ | శ్రీ జి.భిక్షపతి, హైదరాబాద్ | శ్రీమతి ఎస్.అనసూయ, హైదరాబాద్ | శ్రీ జి.శ్రీధర్ బాబు, హైదరాబాద్

కవితా కోవెలలో కామాక్షి

స్వామి సుందర చైతన్యానంద

మెల్లగా మాట్లాడటం మూర్ఖుడు కూడా చేయగలడు. చల్లగా భాషించడం సౌజన్యమూర్తులకే సాధ్యం. వెన్నెల వంటి కవిత్వాన్ని మల్లెల వంటి మాటలతో అల్లడం క్రాంతదర్శులకే సాధ్యం. మహర్షులు క్రాంతదర్శులైన కవులు. వారి మాటలు చిరంజీవత్వం కలిగి ఉంటాయి. వారి పలుకుల లోని పవిత్రత పార్వతీ చరణ కిరణ ప్రసాదము. కనుకనే మధు క్షీర ద్రాక్షాపాకము వలె పలుకులు తేనె లూరుతూ ఉంటాయి.



శరత్కాలపు వెన్నెల వలె నిర్మల భాషణము కలిగి యుండుటయే గాక ఆ మాటలు వినే వారికి, చదివే వారికి చంద్రుని కాంతి వలె ఆహ్లాదంగా కూడా ఉండాలి. మనసులలో కవితా వెన్నెలలు విరజిమ్ముచూ, నాలుకలపై మల్లెల మాటలు విరబూయడం దేవీ కటాక్ష వీక్షణ ఫలమే నంటున్నారు శ్రీ శంకరాచార్య స్వామి. కరములు జోడించి కరుణను పొందిన వారు కవులు కాకుండా ఉండలేరు. కాళిదాసుకు అలాగే వాక్సిద్ధి కలిగింది. మూక కవికి అమ్మ కృపతోనే వాక్శుద్ధి ప్రాప్తించింది.

నరీనర్తు ప్రౌఢా వదన కమలే వాక్యలహరీ

'అమ్మా! నా ముఖ కమలము నందు ప్రౌఢ కవితా ప్రవాహములు నర్తించు గాక!' అని అమ్మను స్తుతించి, ధన్యాత్ముడై మూకమహాకవి సర్వులకు ప్రాతఃస్మరణీయు డైనాడు. జగన్మాత నాలుగు చేతుల యందు శోభించు పరికరములను, చిహ్నములను పరిశీలిస్తే, అమ్మ అనుగ్రహము ద్వారా మనకు చతుర్విధ పురుషార్థములు సిద్ధిస్తాయని తెలుస్తుంది.

ఒక చేతి ద్వారా అమ్మ వరద ముద్రను ప్రదర్శిస్తూ ఉంది. కామ పురుషార్థము సఫలము అవుతుందని ఆశీర్వదిస్తున్నది. రెండవ చేతిలో అభయ ముద్రను ప్రదర్శిస్తూ రక్షణలేని, భద్రత లేని స్థితి నుండి విముక్తిని ప్రసాదిస్తూ భయమును దూరం చేస్తున్నది. అర్థ ఫలమును అనుగ్రహిస్తున్నది.

మూడవ చేతిలో పుస్తకమును పట్టుకొని ధర్మ ప్రవృత్తిని కలిగించి పునీతులను చేస్తూ ఉంది. ధర్మ ప్రవృత్తిని ధరించే శక్తినిస్తూ ఉంది. నాల్గవ చేతిలో జపమాలను ధరించి, జపసాధన ద్వారా జగదీశ్వరుని పొందమని సూచిస్తున్నది. మోక్ష స్థితిని ప్రసాదిస్తున్నది.

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

మోహం చేసే మోసం



బ్యాంక్ లావాదేవిలో ఒక వ్యక్తి బ్యాంక్ మేనేజర్‌ని కలవ వలసి వచ్చి అతని రూముకు వెళ్ళాడు. ఆ సమయానికి మేనేజరు ఊపిరాడనట్లు అనేక వ్యవహారాల్లో తల మునకలై ఉన్నాడు. వచ్చిన పెద్ద మనిషి బల్ల దగ్గరకు మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి తాను వచ్చిన పనిని మేనేజరు వద్ద ప్రస్తావించాడు.

మేనేజరు ఆ వ్యక్తిని తల ఎత్తైనా చూడకుండా ఏదో వ్రాసుకుంటూనే, 'ఎరిగిన వాళ్ళెవరైనా సాక్షిగా ఉండాలండీ! పైగా, ఆ వ్యక్తికి మా బ్యాంకులో ఖాతా కూడా ఉండాలి. అలాంటి వారిని ఎవరి నైనా తీసుకురండి. అప్పుడే మీ పని అవుతుంది' అన్నాడు.

మేనేజరు సమాధానానికి ఆ వ్యక్తి నిర్ఘాంత పోయాడు. కొన్ని క్షణాలు నోట మాట రాలేదు. ఎలాగో తేరుకొని, 'నాయనా, రమేశ్! నేను, మీ నాన్నను నాయనా!' అన్నాడు అతి కష్టం మీద. మేనేజరు తలెత్తి, 'నాన్నా, మీరా! నిలబడే ఉన్నారే! రండి, కూర్చోండి!' అంటూ ఇప్పుడు తన తప్పు దిద్దుకొనే పనిలో తలమునక లయ్యాడు.

ఏమిటి, ఆశ్చర్య పోతున్నారా? ఇలా జరిగే అవకాశం కూడా ఉంటుందా అని సందేహిస్తున్నారా? నిద్ర లేచింది మొదలు అందరం చేసేది అదే కదా! ఇందులో ఆశ్చర్య మేముంది? బ్యాంక్ వ్యవహారాల్లో మునిగి పోయి కన్నతండ్రినే మేనేజరు గుర్తు పట్టలేక పోయాడు. అందరము ప్రాపంచిక విషయాలలో నిమగ్నమై జగత్పిత యొక్క ఉనికినే గుర్తించలేక పోతున్నాము. మోహం ఇలాగే మోసగిస్తుంది.

అద్వైతము

స్వామి సుందర చైతన్యానంద



అద్వైతము అంటే ద్వైతము లేదని అర్థం కాదు. భేదము లేదని అర్థం. ద్వైతము ఉన్నందు వలన అద్వైతము బాధితం కాలేదు. భిన్న మున్నపుడే బాధలన్నీ.

రెండు ఉంటే ఉండనీ. రెండూ ఏకమేనని చెప్పేందుకే శాస్త్రముంది. ద్వైతము మన అనుభవము లోనే ఉంది. ఇక శాస్త్ర మెందుకు? కొందరు గురువులు ద్వైతము సత్యమని మరీ మరీ వాదిస్తూ ఉంటారు. దీనికి వాద మెందుకు? శాస్త్ర మెందుకు? జీవేశ్వరుల మధ్య భేదం ఉందని శాస్త్రము కాదు కదా, చదువు రానివాడు కూడా చెబుతాడు. భేద నిరూపణకు వాదాలు, శాస్త్రాలు అవసరం లేదు. ఈ అర్థరహితమైన వాదాల వలన ముముక్షువులను దారి మళ్ళించడమే అవుతుంది. వారి హృదయాలలో తీరని సందేహములను దించడమే అవుతుంది. వివేకమున్న వారు అలాంటి పనులు చేయకూడదు అన్నారు శ్రీ శంకరాచార్య స్వామి.

నిశ్చితం చ జ్ఞానం పురుషార్థ సాధన మిష్యతే ! అతో సంశతితో వాక్యార్థో వాచ్యః పరహితార్థినా!

'నిశ్చితమైన జ్ఞానము పరమ పురుషార్థమైన మోక్షానికి దారి తీస్తుంది. కనుక పరులకు హితము చేయాలని అభిలషించేవారు సందేహములను కలిగించే వాక్యాలను ప్రయోగించరాదు' అని శ్రీ శంకరాచార్యస్వామి బృహదారణ్యకోపనిష ద్భాష్యంలో తెలిపారు.


రెండు ఉండటము ద్వైతము కాదు. అద్వైతము కాకుండానూ పోదు. భిన్నత్వ ముంటేనే ద్వైతము. భేదము ఉంటేనే ద్వైతము. రెండు కళ్ళున్నాయి. కాని, చూపు ఒక్కటే. రెండు పెదవు లున్నాయి. కాని, నవ్వు ఒక్కటే. రెండు చేతులు జోడించి ఒక నమస్కారం చేస్తున్నాము. ఇవన్నీ ద్వైతంగా కనబడినా అద్వైతమే. ద్వైత ముంటే తప్పు లేదు. భేద ముంటేనే భ్రాంతి. భేదమును శాస్త్రము అంగీకరించదు. తర్కము సమ్మతించదు. అనుభవము ఒప్పుకోదు. అఖండాత్మలో భేదములు అనూహ్యాము. సృష్టికి అన్యంగా ఉండి సృష్టికర్త సృష్టి చేయలేడు. కనుక సృష్టి - సృష్టికర్త ఒక్కరే. అలాంటప్పుడు జీవాత్మ పరమాత్మ కాకుండా ఎలా ఉండగలడు? కనుక **'అయమాత్మా బ్రహ్మ'** ఈ జీవాత్మయే పరమాత్మ యని వేదము మహావాక్యము నందించింది. జీవబ్రహ్మలు ఒకటే అయినపుడు బ్రహ్మ జగత్తులు ఒకటే అయినపుడు, జీవ జగత్తుల మధ్య భేదమెలా సాధ్యం? కనుక జీవ చైతన్యమే జగద్రూపంలో ఉంది. అంతా అఖండాత్మయే. ఇదే సర్వ వేదాంత సిద్ధాంత సార సంగ్రహము. సర్వ శాస్త్రముల **'ఏకవాక్యతా'** ఇదే.

రామనామ స్మరణం

స్వామి సుందర చైతన్యానంద

కాయం కలకాలం నిలిచేది కాదు. సంపదలు శాశ్వతం కావు. భార్యాబిడ్డలు తోడురారు. కీర్తి మృతిని తప్పించలేదు. కనుకనే,

వెట్టికుక్కల భ్రమలన్ని విడచి నిన్నె భజన జేసెడి వారికి పరమసుఖము అన్నాడు శేషప్ప కవి. అనేక పనుల్ని భుజాన వేసుకున్న ఏకైక అవయవము మానవ దేహంలో నాలుక. దానికి తినడమే కాదు; తిట్టడం కూడా తెలుసు. పలకడం తెలుసు; అబద్ధాలు అనర్గళంగా పలకడం తెలుసు. అగ్ని లేకుండా కొంపలు మండించే శక్తి, నీరు లేకుండానే ప్రపంచాన్ని ముంచే శక్తి నాలుకకే ఉంది. మంచి పలికి కోటలు నిర్మించేది, చెడు పలికి బాటలు నాశనం చేసేది అదే.



నాలుకను శుద్ధి చేసుకోవాలి. బుద్ధి నేర్పి, రామనామాన్ని ముద్దు ముద్దుగా పలికించాలి. నామామృతపానం వల్ల నాలుక దోషరహిత మవుతుంది. నరుని నాలుక నామం పలికే భాగ్యానికి నోచుకోకపోతే ఆ నాలుక వైశిష్ట్యమేమిటి? మనిషికీ నాలుకుంది. మృగానికీ ఉంది. తేడా ఏముంది?

శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ

అని ప్రహ్లాద కుమారుని ప్రబోధము.

సా రసనా తే నయనే తావేవ కరౌ స ఏవ కృతకృత్యః

"భగవన్నామాన్ని పలికే నాలుకే నాలుక. భగవద్రూపమును దర్శించు కన్నులే కన్నులు. పరమాత్మను పూజించు కరములే కరములు. భగవత్స్మరణముగల నిత్యభక్తుడే కృతకృత్యుడు అన్నారు శ్రీశంకరాచార్య స్వామి.

జీవితములో మన మనుభవించిన అత్యున్నతమైన సుఖాలు, అతీతమైన దుఃఖాలు, అతీతమైన బాధలు ప్రయత్నం లేకుండా జ్ఞాపకమొస్తుంటాయి. పరమాత్మకన్నా మించిన సుఖము, ఆనందము ఎక్కడ లభిస్తుంది? ఈ విషయం మన బుద్ధికి అందితే భగవంతుడు సదా స్మృతిలో మెదుల్తాడు. కష్టం లేకుండా సదా జ్ఞాపకం చేసుకోగలం. పరమాత్మ స్మృతి పుటల్లో కదుల్తూ ఉంటే అంతా సుఖమే. అంతా ఆనందమే. అన్నీ పుణ్యాలే. కనుకనే సుఖాన్ని రామనామం వృద్ధి చేస్తుంది. పుణ్యాన్ని పెంచుతుంది.

రామనామం పుణ్యాన్ని, సుఖాన్ని వృద్ధి చేయడమేకాదు. పాపాన్ని, అశుభాన్ని క్షయింప చేస్తుంది. తిరిగి రాకుండాచేస్తుంది.

'రా' శబ్దోచ్చారణా దేవ ముఖాన్నిర్యాన్తి పాతకాః
పునః ప్రవేశ భీత్యా చ "మ"కారస్తు కవాటవత్ ॥

'రామ' అను పదంలో 'రా' అనే మొదటి అక్షరమును పలుకగనే లోపలున్న పాపములన్నీ బయటికి పోతున్నాయి. 'మ' అనే రెండవ అక్షరమును పలుకగనే పెదవులు రెండూ ఏకమగుటచేత పోయిన పాపాలు తిరిగి లోనికి రాలేకపోతున్నాయి. ఇది రామ మంత్రము నుచ్చరించుటలోని వైభవము.

సూర్యుడు ఉదయించనంత వరకే ప్రపంచంలో చీకట్లు ఉంటాయి. నామ భాస్కరుడు నాలుకపై నాట్యమాడనంత వరకే జీవితంలో ఇక్కట్లు ఉంటాయి. వచ్చిన బాధంతా ఆ రుచిని ఇంకా మనము అనుభవించకుండా ఉండుటయే.

నామం మాట రూపంలో నాలుక మీద నుండి దొర్లిపోతున్నదే గాని, స్థిరంగా నాలుకపై నిలువడం లేదు. నామసాధనలో ముఖ్యంగా రెండు విషయాల్ని మరచిపోకూడదు. 1. సదా జరిగేలా చూసుకోవడం 2. భక్తి ప్రేమలతో ఉచ్చరించడం - ఈ రెండు విషయాల్ని పాటించగలిగితే నామసాధన ఫలాన్ని జీవితంలో చూడవచ్చు. ఇది సులభమైన మార్గము. సున్నితమైన మార్గము. సురక్షితమైన మార్గము. సుందరమైన మార్గము. మనసు ఇష్టపడిన విషయాన్నే నాలుక మాట్లాడుతుంది. కనుక సదా మనసు భగవంతునిలో రమించేలా చూడగలిగితే నాలుక శ్రమ లేకుండా రామనామాన్ని ప్రేమతో పలుకుతుంది. కనుక మనోభృంగం పరమాత్మ పాదకమలముల చెంత నిలిచేలా సాధకులు ప్రయత్నించాలి.

రామచంద్ర చరణారవిందయో రంతరంగ చరభృంగ లీలయా
తత్ర సన్తి రసా శ్చతుర్విధా మాకరంద రస ఏవ పంకజే ॥

'ఓ మనోభ్రమరమా! రామచంద్రుని చరణములు అనే సరోజములలో తిరుగు. చూడు! అక్కడ చతుర్విధ పురుషార్థములనే నాలుగు రసాలున్నాయి. మామూలు పద్మమైతే తేనె ఒక్కటే ఉంటుంది". ఈ సత్యాన్ని మనసు కెక్కించాలి. హృదయంలోకి దింపాలి. నాలుకపై నడిపించాలి. అప్పుడు బ్రతుకే నామమయ మవుతుంది. కల్మషాలు కరిగిపోతాయి. కాఠిన్యాలు కాలిపోతాయి. కష్టాలు కనుమరుగవుతాయి. కాంతులు కళ్ళముందు నిలుస్తాయి. అన్ని మార్గాల కన్నా భక్తిమార్గం సులభమైంది. అందులో నామసాధన మరీ సులభమైంది. ప్రేమ అందరిలో సహజంగా ఉన్నందున ప్రేమ సంబంధమైన భక్తి సాధన అన్ని మార్గాలకన్నా సులభతరం. ధనవంతులే యాగాలు చేయగలరు. యోగాలు కష్టతరమైనవి. ప్రమాదాలతో కూడినవి. జ్ఞానము అందరి బుర్రలకీ ఎక్కేది కాదు. భక్తి ప్రేమమయం కనుక పంచదారలా మధురంగా ఉంటుంది.

లడ్డు తింటే తియ్యగా ఉంటుంది. ఇది స్వయంప్రమాణము. అనుభవరూపం.

దీనికి వేరే ప్రమాణం అవసరం లేదు. అలాగే నామసాధన. ప్రేమతో నామాన్ని కీర్తించగనే నామియైన నారాయణుడు హృదయంలో నిలుస్తాడు. ఇది కేవలం అనుభూతి. ఇక్కడ మరొక ప్రమాణ మవసరంలేదు. కలలో ఎన్నో కనిపిస్తాయి. కనువిందు చేస్తాయి. హాయిని గొలుపుతూ తోడుంటాయి. అవి నీకున్నాయి. ఈ నిజాన్ని ఎవరూ కాదనడం లేదు. అవి నీవి అనుకుంటే మాత్రం 'కాదు' అని చెప్పవలసి ఉంటుంది.

ఈ ప్రపంచంలో ఏవీ మనవి కావు. చివరికి దేహంకూడా మనదికాదు. దేహం మనకు ఉపకరిస్తుంది. మనది కాదు. కనుకనే శ్మశానంలో తగలబడి పోతుంది.

అన్ని విషయాల్లోనూ అంతే. ఇది తెలిస్తే ఆశలు అదృశ్యమై, అవసరాలు మాత్రమే నిలుస్తాయి. అవి కూడా ఉంటాయేగాని మనసులో ఊరేగవు. ఇంట్లో ఆసీనులమైయున్నా మనసులో ఉదాసీనులుగనే ఉంటాం. మాయలో పడి, మర్మమెరుగని దోషం వల్ల విషయ సుఖాలమధ్య వెంపర్లాడుతూ విసిగిపోతున్నాము. విషయాలనే గాజుపెంకుల్ని ప్రోగు చేసుకుంటూ రత్నాలను దారబోసుకుంటున్నాం. చింతామణిని త్యజించి గురువింద గింజల్ని ప్రేమిస్తున్నాం. ఈ పరిస్థితి శ్రేయోదాయకం కాదని, ప్రమాదభరితమని మహాత్ములు హెచ్చరిస్తున్నారు. సుఖపడాలనుకుంటే రామనామాన్ని ఆశ్రయించమంటున్నారు.

స్మరణే సుఖము - రామనామ ॥ స్మరణే ॥
నరుడై పుట్టినందుకు రామనామ ॥ స్మరణే ॥
రామనామ శ్రవణము వల్ల నామరూపమే హృదయంబు నిండి
ప్రేమ పుట్ట సేయగ లేదా నిష్కామ త్యాగరాజు సేయు నామ ॥ స్మరణే ॥

మనిషై పుట్టినందుకు సుఖప్రదమైన రామనామమును స్మరించుటయే శ్రేయము. రామనామ స్మరణము చేయువారి హృదయంలో సదా రామ రూపమే నిండిఉండి, దివ్యప్రేమను పుట్టిస్తూ ఉంటుంది. అదియే దివ్య సుఖము అని త్యాగరాజస్వామి అనుభవామృతాన్ని పంచిపెట్టారు.

(21వ పేజీ తరువాయి)

అన్తఃసంగ పరిత్యాగీ లోకే విహర


'ఆంతర్యమున సంగము లేనివాడవై ప్రపంచమున చరింపుము' అని నారద పరివ్రాజకోపనిషత్తు తెలిపింది.

విషయాలు బుద్ధిని కలుషితం చేస్తాయి. అంతఃకరణను కలవర పరుస్తాయి. సాధనను వక్రింప జేస్తాయి. ఆత్మ సామ్రాజ్యంలో ప్రవేశింప నివ్వక అడ్డు తగులుతాయి. అందుచేత సాధకుడు విషయ సుఖాల యందు జాగరూకుడై మెలగాలి. సంసార సుఖాలు అనిత్యమని భావించి పరమాత్మ పొందుకై యత్నించాలి.

శ్రీకృష్ణ కథా గానము - భక్తి జ్ఞాన దృశ్య మాలిక

శ్రీమతి సి. పద్మ

వినడము, వినిపించడము రెండూ మనసే చేస్తుంది. వినిపించిన శబ్దాన్నే కొండలు ప్రతిధ్వనించినట్లు, విన్న విషయాలనే మనసు తిరిగి వినిపిస్తుంది. ప్రాపంచిక విషయాలను వింటే ప్రాపంచిక విషయాలనే వినిపిస్తుంది. ప్రపంచ వార్తలను అందరూ వినిపిస్తారు. హరి వార్తలను భాగవతోత్తములే వినిపించగలరు.



స్వాతిచినుకు ముత్తెపుచిప్పలో పడినప్పుడే ముత్యంగా మారినట్లు, పరమ పావనమైన పరమాత్మ గాథ సద్భావనా వలువలను ధరించి, జ్ఞానమణులను అలంకరించుకొని వేదాంత వెలుగులను వెదజల్లుతూ వెలువడేది పూజ్య స్వామీజీ కళా హృదయం నుండే. కలమైనా, గళమైనా, పాటైనా, మాటైనా, దృశ్యమైనా, శ్రవణమైనా అందాన్ని సంతరించుకునేది పూజ్య గురుదేవుల అమృత హస్తాల లోనే.

కృష్ణకథను అందరూ వినిపించలేరు. వినిపించే వారందరూ వివరముగా వినిపించలేరు. వినిపించినా అంత మధురముగా వినిపించలేరు.

వినవే మనసా! వినిపించెదను వీనుల విందుగా వివరముగా
మనసారగా మధురముగా మోహనకృష్ణుని మంజులగాథ ॥

ఇది పూజ్య స్వామీజీ రచించి, స్వరపరచి, గానం చేసిన కృష్ణకథాగానానికి పల్లవి. శ్రీమద్భాగవతంలో కృష్ణకథను వివరించే దశమస్కంధం ద్వాదశ స్కంధాల లోకి అతి పెద్దది. వేయి పేజీలు గల **చైతన్య భాగవత** గ్రంథంలో 365 పేజీలను ఈ దశమ స్కంధానికే పూజ్య స్వామీజీ కేటాయించారు. బహుశ 365 రోజులూ మననం చేయదగిన విషయ మని కాబోలు! అందులో కృష్ణ జననం నుండి కంసవధ వరకు 215 పేజీలలో విపులంగా వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ **కృష్ణకథ గానము** అనే కావ్యంలో కేవలం 108 చరణాలలో శ్రీ స్వామిజీ పొందుపరచారు. పురాతనుడు, సనాతనుడు అయిన పరమాత్మ గాథను ఒక కొంగ్రొత్త పంథాలో నడిపి విచిత్రమైన పద ప్రయోగంతో, వినూత్నమైన పోకడతో సర్వులకు మనోరంజకమైన, విజ్ఞానకరమైన అద్భుత సృష్టిని గురుదేవులు అందించారు.

చిన్న విషయాలను పెద్దగా చేసి చెప్పడం అందరికీ సాధ్యమే. కాని, మహత్తరమైన విషయాన్ని మదించి, కుదించి, లోతైన భావాలు తేలిపోకుండా, సూక్ష్మమైన విషయాలు



జారిపోకుండా, కొండ అద్ద మందు కొంచెమై ఉండదా అన్నట్లు, విశాలమైన ఆకాశాన్ని గుప్పిట్లో బంధించినట్లు, సాగర సదృశమైన శ్రీకృష్ణ చరితను పిడికెడు గుండెలో నిక్షిప్తం చేయడమనే బృహత్కార్యం పరమ పూజ్యులైన మన గురుదేవులకే సాధ్యమయింది. చరణంలో నాలుగు పాదాలు, ఒక పాదంలో నాలుగు పదాలు, ప్రతి పదంలో నాలుగు అక్షరాలు - అంతకు మించి ఎక్కడో గాని మనకు కనిపించవు. పూజ్య స్వామీజీ మాటలను, పాటలను వర్ణించడం సామాన్యులమైన మనకు సాధ్యం కాదు. ఎవరికి వారుగా కని, విని, ఆనందించి తరించేందుకు **కృష్ణకథాగానము** అనే వీడియో సి.డి. ఇరవై సంవత్సరాల క్రితం గురుదేవుల కళా హృదయానికి పూర్ణ రూపంలా మన కళ్ళ ముందు అవతరించింది.

శ్రీకృష్ణుని బాల్యక్రీడలను, చోరలీలను, రాసమండలంలో రాసవిభుని వైభవాన్ని, దుష్టశిక్షణ - శిష్టరక్షణ ఘట్టాలను అత్యంత రమణీయంగా ఈ దృశ్యమాలికలో చిత్రీకరించారు పూజ్య స్వామీజీ. స్వామీజీ పాడుతూ ఉంటే గ్రాఫిక్స్ ద్వారా, సుందరమైన ప్రకృతి దృశ్యాల ద్వారా, నర్తకీమణుల అందమైన అభినయం ద్వారా ఆయా చరణాల లోని భావం చలనచిత్ర రూపంలో వ్యక్త మవుతూ ఉంటుంది. ముఖ్యంగా గ్రాఫిక్స్‌లో కదలికలు (ఏనిమేషన్) సృష్టించడానికి కొన్ని మాసాలుగా పూజ్య గురుదేవుల ఆదేశానుసారం ఆశ్రమ బ్రహ్మచారులు కంప్యూటర్‌పై పని చేస్తూ శ్రీ స్వామీజీ భావాలకు అనుగుణంగా పాట చిత్రీకరణను పూర్తి చేశారు.




ఉట్టి పైన కుండల నుండి పాలు, వెన్న కారడం, తలుపులు తెరుచుకొని మూసుకోవడం, పొయ్యిలో మంట పైకి ఎగయడం, పాలు పొంగి పొయ్యిలో పడడం, గోపిక మూతికి వెన్నను రాయడం, కుండలు ఎత్తుకెళ్ళి బ్రద్దలు కొట్టడం, రోలు దొర్లుతూ

వచ్చి వృక్షాలను కూల్చడం, రాక్షసుల దేహాల నుండి రక్తం స్రవించడం, మురళీగానానికి చెవులపిల్లులు చెవులు కదిలించడం, నెమళ్ళు పింఛాలను ఆడించడం, వనితల వీనుల కమ్మలు లయబద్ధంగా ఊగుతూ ఉండడం - ఇవన్నీ కంప్యూటరుపై సృష్టింపబడిన అద్భుతాలు. AI (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) దృశ్యీకరణ రూపుదాల్చక ముందే ఈ అద్భుతాలన్నీ ఆశ్రమ నాదచైతన్యం స్టూడియోలో జరిగాయి అనేది విశేషం.



ఇక తాత్త్విక లోతుల లోకి దిగితే ఈ పాట యొక్క చిత్రీకరణ వర్ణనాతీతం. పంచ జ్ఞానేంద్రియాలు పట్టి లాగుతూ ఉంటే నిలవలేని మనస్సు విషయ ప్రపంచం లోకి పరుగిడుతూ పరిభ్రమిస్తూ ఉంటుంది. ఇంద్రియాలు నిగ్రహింపబడని మనస్సు ఎటైనా పోవచ్చు, ఏమైనా కావచ్చు. ఇందుకు సంకేతంగా పంచేంద్రియాలతో కూడిన మనస్సును ఐదు బంగారు గుఱ్ఱాలు పూన్చిన రథం గాను, అదుపులో లేని ఇంద్రియాలను సారథి లేని గుఱ్ఱాలు గాను అత్యద్భుతంగా చిత్రీకరించారు.

బుద్ధి లేని మనస్సు సారథి లేని రథమే కదూ! అందుకే అది ఒక్కొక్కప్పుడు వైజ్ఞానిక పరిజ్ఞానం కోసం అర్రులు చాస్తూ అంతరిక్షం లోకి దూసుకు పోతుంది. సృష్టి లోతులకు దిగాలంటూ సముద్ర గర్భం లోకి దూకుతుంది. ప్రకృతి అందాలను పలుకరిస్తూ కొండ కోనలలో, పచ్చిక బయళ్ళలో, పంట పొలాలలో, పూల వనాలలో విహరిస్తూ ఉంటుంది. వినోదాలకై వెంపర్లాడుతూ క్రికెట్‌మ్యాచ్‌లు, షాపింగ్ మాళ్ళు, బీచుల వెంబడ తిరుగుతూ ఉంటుంది. కంప్యూటర్లు, ఇంటర్నెట్లు, రోబోలు, శాటిలైట్లు, ఒకటేమిటి! అది వెదకని వస్తువు లేదు, చవిచూడని విషయం లేదు. ఇలా బహిర్ముఖమై అనేక జన్మలలో అవిశ్రాంతంగా విశ్వం చుట్టూ ఒక అనాథగా పరిభ్రమించిన మనస్సు పాట చివరలో, ఫలశ్రుతి వినిపించే సమయానికి సనాథగా మారి గురుదేవుల చేతికి కళ్ళాలను అందించి, మెల్లమెల్లగా అంతర్ముఖ మవుతూ తనకు పుట్టుక స్థానమైన జగన్నాథునిలో విలీనం కావడం అనే దృశ్యం పూజ్య స్వామిజీ అద్భుత కళా నైపుణ్యానికి నిదర్శనం. గ్లాసులో నీళ్ళు త్రాగితే అవి మంచినీళ్ళు అవుతాయి. దాహం తీరడానికి ఉపకరిస్తాయి. శంఖం నుండి అందితే అదే జలం తీర్థ మవుతుంది. పూజ్య గురుదేవుల అమృత హస్తాల నుండి వెలువడిన ఈ **కృష్ణకథాగాన** మనే తీర్థాన్ని స్వీకరించి ఇప్పటివరకు ఎందరో భక్తులు బ్రతుకును కృష్ణమయంగా మార్చుకున్నారు. కని, విని మనమూ తరించెదము గాక!



శ్రీకృష్ణ కథాగానం


ధారావాహిని-1

స్వామి సుందర చైతన్యానంద



పల్లవి :

వినవే మనసా! వినిపించెదను
వీనుల విందుగా వివరముగా
మనసారగా - మధురముగా
మోహన కృష్ణుని మంజులగాథ



(1) దయగల దైవము సృష్టిని చేసి
ధర్మరూపమున దాగెను ఇలలో
ధర్మము తరిగి అధర్మము పెరిగిన
ధర్మ రక్షణకు దైవము దిగును ॥ వినవే ॥

(2) అసురుడు కంసుడు హింసలరాయుడు
దయనీయముగ ధరణిని మార్చె
అవనిని రక్షింప అసంసారి
కంసారియై సంసారము చేసే ॥ వినవే ॥





(3)ఉదారచరితుడు దామోదరుడు
ఒదిగెను దేవకి ఉదరమున
పురిటినొప్పులు తెలియని తల్లి
నీళ్ళాడెను నీలాంబరదేహుని ॥ వినవే ॥

(4) వసుదేవ శిరమున వాసము చేయ
ఆదమరచిరి అసురులు
కారాగారము ద్వారము తెరిచే
పొంగే యమునా దారి నొసంగె ॥ వినవే ॥





(5) నందగోకులము ఆనందమాయె
నందుని గృహము నందనమాయె
అజరుద్రులకు అందని భాగ్యము
నారీమణుల పూజాఫలము ॥వినవే ॥


(6) తల్లుల చనుబాలు ఎరుగనివాడు
యశోద ఒడిలో ఒదిగెను నాడు
పెరుగుట తరుగుట తెలియనివాడు
గోకులవాడలో పెరిగెను నాడు ॥ వినవే ॥





(7) విషగళ సఖుడని తెలియని రక్కసి
విషకుచములను అందించె
చన్ను విడువమని అరచినగాని
పాలతో పాటు ప్రాణము లాగె ॥

(8) సంసార శకటమె శకటాసురుడు
బ్రతుకును నిస్సారము చేయు
అసురారి కృష్ణుని అశ్రయించిన
ఆపదలన్నీ సంపద లగును ॥ వినవే ॥





(9)బ్రతుకు రణములో మిగిలేది తృణము
కాలము సుడిగాలి అంతా ధూళి
ఎటు గొని పోవునో ఏమి చేయునో
అచ్యుతుని చేతిలో హతమగును ॥

(10) నందకిశోరుని తొడపై నిడుకొని
ప్రేమ పొంగి పాలిచ్చెను తల్లి
నెమ్మోమును ముద్దాడిన మాతకు
ఆవులించి జగమును చూపె ॥ వినవే ॥





(11) ఊరకరాని మహాత్ముడు గర్గుడు
పుణ్యాలుంటే గాని దొరకడు
రామకృష్ణులని నామము లొసగి
పరవశించి పరమార్థము తెలిపె ॥ వినవే ॥



(12) బుడిబుడి అడుగులు వడివడి వేయుచు
ఆడుచు పాడుచు అగపడడు
కాగిన పాలను కాజేయును క్షణములో
అడిగిన వారిని దొంగలు అనును ॥

(13) గొడవలరాయుడు గోకులమందున
సృష్టించెను అలజడి వేడుకలు
ఓపిక ఉడిగిన గోపికలందరు
మొరపెట్టుకొనిరి మాతను చేరి ॥ వినవే ॥



(14) అమ్మా! యశోద! ఇది మా బాధ!
నీ బిడ్డ గొడవ విను ఓ మగువ!
బిడ్డలు లేరని వనిత వగచగా
తను మగడైతే కొదవే లేదట॥ వినవే ॥





(15) చౌర్యమేల యని గట్టిగ నడిగితి
ప్రతిఫల మేదో విను పడతి
కోతులతో, కోతి మూకలతో వచ్చి
పగులగొట్టెను పాలకుండలు ॥ వినవే ॥

(సశేషం)

మనసును చూస్తూ ఉండు

స్వామి సుందర చైతన్యానంద



మనిషికి మనస్సు ఉంది. మనస్సులో సంకల్పాలు ఉంటాయి. చలించే సంకల్పాలతో కలిసి సంచరించడం మనకు తెలుసే గాని, ఆ నడిచే సంకల్పాలను పరిశీలించాలని, వాటిని విశ్లేషించి అర్థం చేసుకోవాలని మనం ఎప్పుడూ ప్రయత్నించము. ఇక్కడే జీవితం అయోమయంగా మారుతోంది.

ఆధ్యాత్మికంగా అభివృద్ధిని సాధించాలని భావిస్తామే గాని, అర్థరహితమైన ఆలోచనలతో, నిరుపయోగమైన సంకల్పాలతో బుద్ధి పాడౌతుందనే విషయాన్ని గుర్తించము. అలా పాడైన బుద్ధి భగవంతునికి దూర మౌతుందనే సత్యాన్ని గ్రహించము. అంతరేక్షణ లేకుండా మనస్సు ప్రగతి మార్గంలో చరించ లేదు.

ఆలోచనలను నిరంతరం పరిశీలిస్తూ ఉండాలి. పరీక్షిస్తూ ఉండాలి. అర్థరహిత మైన ఆలోచనల్ని, నిరుపయోగమైన సంకల్పాలను మనస్సు నుండి తొలగించాలి. దైవ సంబంధమైన సంకల్పాలే మనస్సులో సదా నడిచేటట్లు చూసుకోవాలి.

ప్రతి ఆలోచన భావ గర్భితంగా ఉండాలి. నిర్మాణాత్మకంగా ఉండాలి. బలవత్తరంగా ఉండాలి. భక్తి పూర్వకంగా ఉండాలి. మనస్సు నిరంతరము ఋజుమార్గంలో సంచరిస్తూ ఉండాలి. ప్రారంభములో ఈ సాధన కష్టతరం గానే ఉండొచ్చు. అభ్యాసంలో అలవాటుగా మారిపోతుంది. శ్వాస తీసుకున్నంత సహజంగా సాగిపోతుంది.

మన మనస్సులో నడిచే ప్రతి ఆలోచన మనకు శాంతిని ప్రసాదిస్తూ ఉండాలి. ఓదార్పును ఊరిస్తూ ఉండాలి. మనస్సును జాగ్రత్తగా పరిశీలిస్తే ఉపయోగం లేని ఎన్నో ఆలోచనలు మన మనస్సులో సాగిపోతున్నా యని అర్థ మవుతుంది. వాటిని వెంటనే ఆపేయాలి. అవి సాగకుండా జాగ్రత్త పడాలి. అంతేగాని నిరాశ చెంద కూడదు. నిరాశ మనస్సులో ఎందుకు వస్తుంది? సద్భావాలు మనస్సులో నిండితే, నిరాశా నిస్పృహలు మనస్సును చేరవు.


ఇక్కడ ఒక్క సత్యాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి. ఆలోచించే వాడు ఆలోచన కన్నా అన్యమైన వాడు అనే సత్యాన్ని గ్రహించాలి. ఇది అర్థమైతే, నీవు మనస్సుతో చేయి కలిపి పరుగులు పెట్టవు. మనస్సుకు సాక్షిగా నిలిచి పోతావు. సర్వసాక్షి యైన నిన్ను ఏ చెడు సంకల్పము కదిలించ లేదు. సంకల్పాలు ప్రవాహంలా సాగిపోతున్నా, వాటన్నిటికి నీవు సాక్షిగా ఉండి పోతావు. శాంతితో నిండి పోతావు. నిస్తరంగంగా శోభిస్తావు.

శ్రీ సద్గురో! నమస్తే!

- శాంతిశ్రీ, గుంటూరు

1. శ్రీ సనాతన ధర్మామృత సార సర్వస్వ
మెల్ల దిక్కులకు నందించినావు
వేదవేదాంతాది విద్యారహస్యాలు
నియత చిత్తుల హృది నించినావు
ప్రార్ధనా పూజాది సార్ధక విధులర్థి
నెల్ల భక్తులకు బోధించినావు
జపతపోధ్యానాది సాధనా మార్గాలు
ఎంచి విజ్ఞుల కెఱింగించినావు
ఆర్త జనతాహితైషి! హే ఆర్య పురుష!
వేద వేదాంతవేది! హే సాధుమూర్తి!
ధన్య! సద్గ్రంథకర్త! హే పుణ్యకీర్తి!
ధీర! సుందర చైతన్య! తే నమోస్తు!





2. ఎన్నో! గీతాసభల మ
ఱెన్నో వేదాంత సభల లీలా హేలా
సన్నుత! సద్వాగ్వైఖరి
చెన్నారగ తత్త్వబోధ జేసితయారే!

3. వేలకు వేల్ భక్త జనత
లీలా మనుష ముకుందు శ్రిత భక్తులను
ద్వేల దయారస దృష్టిన్
పాలించెడి బాల కృష్ణు భజియింత్రు హృదిన్

4. శ్రీ సుందర చైతన్యా!
ధీసంపన్నా! మహర్షీ! తేజశ్శాలీ!
భాసుర! జ్ఞానబ్రహ్మా!
ఆసర్వత్ర ప్రకాశ! ఆప్త! నమస్తే!

5. జయతు! జయతు! భక్తిజ్ఞాన శాస్తా! ప్రవక్తా!
జయతు! జయతు! జ్ఞానీ! శాంతచిత్తః ప్రసన్నః
జయతు! జయతు! వంద్య శ్శాంతి దాంతి ప్రదాతా
జయతు! జయతు! ప్రాజ్ఞస్సాధు చైతన్య విజ్ఞః

హైదరాబాద్ సుందర చైతన్య గ్రంథాలయం



2000 సంవత్సరం మార్చి **12**వ తేదీన హైదరాబాద్ - విద్యానగర్ చౌరాస్తాలో రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల మేడలో 'సుందర చైతన్య గ్రంథాలయం' సర్వాంగ సుందరంగా, సరస్వతీ మందిరంగా ప్రారంభింపబడింది.

అవగాహనతో సాగే సేవలు చాలా అందంగా ఉంటాయి. అలాంటి సేవల వెనుక త్యాగాలు చాలా సుందరంగా ఉంటాయి.

విద్యానగర్ చౌరాస్తా లాంటి అందమైన కూడలిలో లక్షలాది రూపాయల విలువ చేసే భవనాన్ని ఆశ్రమానికి అంకితం చేయాలని పూజ్య స్వామీజీ శిష్యురాలు శ్రీమతి నారాయణమ్మ గారు నిర్ణయించుకోవడం ఆమె త్యాగనిరతికి, పూజ్య స్వామీజీ పట్ల ఆమె కున్న అపార భక్తి ప్రేమలకు తార్కాణము. విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఒక శాశ్వత పథకాన్ని రూపొందించి, అందమైన ఆ భవనంలో గ్రంథాలయాన్ని రూపొందించటం శ్రీ స్వామీజీకి, ఆశ్రమానికి గల సుస్పష్ట సేవా దృక్పథానికి నిదర్శనము.

సుమారు వెయ్యి గ్రంథాలతో, సుందర చైతన్య ఉద్యమాన్ని ప్రతిబింబించే వందలాది చిత్రపటాలతో, వారమునకు రెండు పర్యాయాలు పూజ్య స్వామీజీ బోధలను వింటూ దర్శించేందుకు అనుకూలంగా వీడియో ఏర్పాట్లు, క్యాసెట్లను వినేందుకు హెడ్‌ఫోన్ సౌకర్యంతో ఆడియో ఏర్పాట్లు, పూజ్య స్వామీజీ గ్రంథాలను, క్యాసెట్లను పొందేందుకు ప్రత్యేకంగా విక్రయశాలతో, చక్కని గాలి, చల్లని నీటి సదుపాయాలతో శ్రీకృష్ణ, సరస్వతీ విగ్రహాలతో పూజామందిరాన్ని మరపిస్తూ సుందర చైతన్య గ్రంథాలయం శారదా నిలయంగా ముస్తాబై శోభించింది.

12వ తేది సాయంత్రం **6.30** గంటలకు పూజ్య స్వామీజీ వచ్చారు. విశేష సంఖ్యలో భక్తులు గుమిగూడి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పోలీసు శాఖ వారు ట్రాఫిక్‌ని కొన్ని గంటల పాటు క్రమబద్ధంగా నడిపారు.

పూజ్య స్వామీజీ మంగళ వాద్యములు, కరతాళ ధ్వనుల మధ్య, సుమ వృష్టి నడుమ నిలబడి, ద్వాదశాక్షరీ మంత్ర ధ్వనులు మిన్ను మిట్టుచుండగా 'సుందర చైతన్య గ్రంథాలయాన్ని' ప్రారంభించారు.

హైకోర్టు న్యాయమూర్తి శ్రీ వి.ఈశ్వరయ్య గారు జ్యోతి ప్రజ్వలనం గావించి సరస్వతీ పూజ చేశారు. మాజీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ పి.కోదండ రామయ్య గారు కృష్ణ పూజ చేసి, పూజ్య స్వామీజీ రచించిన 'చైతన్య రామాయణం'లో సుందరకాండ ఉపోద్ఘాతాన్ని చదివి 'చైతన్య గ్రంథాలయం'లో ప్రథమ పాఠకులయ్యారు.

పూజ్య స్వామీజీ ప్రసంగం ప్రారంభించారు. క్రిక్కిరిసిన జనసందోహం హాలు లోను, వరండా లోనే గాక రోడ్డుపై కూడా గుమిగూడి నిశ్శబ్దం తాండవిస్తుండగా ధ్యానమగ్నులై శ్రవణం చేశారు.

'సరస్వతీ నమస్తుభ్యం' అనే దివ్య శ్లోకంపై శ్రీ స్వామీజీ సాగించిన ప్రసంగం శ్రోతలను పరవశింప చేసింది.



విద్యానగర్ చౌరాస్తా - నల్లకుంట





ఆత్మ బంధువులారా
ఓం నమో భగవతే వాసుదేవాయ.

ఆత్మబంధువులారా!

ప్రపంచం ఉంది. ఈ విషయంలో ఎవరికీ ఎవరి తోనూ విభేదం లేదు. కాకపోతే, ప్రపంచం తనకు తానుగా ఉందా? తన కారణం గానే తాను ఉందా? ఇది కాస్త ఆలోచించ వలసిన విషయము. విచారించ దగిన జ్ఞాన విషయము.

ప్రపంచం ఉంది. కాని, మనస్సు లేని చోట ప్రపంచం ఉన్నట్లుగా ఎవరి కైనా తెలిసిందా? అలాగే, మనస్సు ఉంది. మనస్సు తాను ఉన్నట్లు తెలుసుకో గలుగుతుందా?

ప్రపంచం ఉంది. అలా ఉన్నట్లు మనస్సుకు తెలుస్తూ ఉంది. అలాగే మనస్సు ఉంది. కాని, మనస్సు ఉన్నట్లు నీవు తెలుసుకుంటున్నావు. నీవూ ఉన్నావు. అయితే, నీవు ఉన్నట్లు నీకు తెలుస్తూ ఉంది. సత్యాసత్యాలకు ఇదే తేడా. ప్రపంచము, మనస్సు - అవీ తమకు తాముగా అస్తిత్వము లేకపోవటమే గాక, తాము ఉన్నట్లు తెలుసుకొనే స్థాయిలో లేకుండా ఉన్నాయి. కాని, నీవు అలా కాదు. నీవు ఉన్నావు. అలా ఉంటున్నావు అనే జ్ఞానంతో ఉన్నావు. అందుకే నీవు స్వతస్సిద్ధాత్మ; స్వప్రకాశాత్మ.

ఆత్మ నీకు అన్యంగా లేదు; అతీతంగా ఉండదు. బాహ్యంలో లేదు; అలాగని అంతరం లోనూ లేదు. బాహ్యాభ్యంతరాలు దేహస్థాయి లోనివి. ఆత్మ దేశ పరిచ్ఛిన్నం కాదు. అన్నీ ఆత్మ లోనే ఉన్నాయి. ఏదీ ఆత్మకు అన్యంగా లేదు. ఏది ఉన్నట్లు అనిపించినా, దానికి అధిష్ఠానంగా ఆత్మ ఉంటుంది. ఆత్మ ఉన్నందునే సమస్తమూ ఉంది. సమస్తము లేకపోయినా ఆత్మ ఉంటుంది. కనుక, ఆత్మయే సత్యము. దానికి అన్యంగా తెలిసే దంతా మిథ్య **(ఆత్మా సత్యం, తదన్యత్ సర్వం మిథ్య ఇతి).** సమస్తమూ లేకపోయినా ఆత్మ ఉంటుంది అంటే, ఆ సమస్తములో దేహం లేదా? దేహము లేకపోయినా ఆత్మ ఉంటుంది అనే కదా అర్థం. అలాంటప్పుడు ఆత్మ దేహములో ఎలా ఉంటుంది? ఇది అర్థం కాకపోవటం చేత, ఏ తెరపై బొమ్మలు కదులుతున్నవో, అలా కదిలే బొమ్మల లోనే తెర ఉన్నట్లు మనిషి భ్రమిస్తున్నాడు. వాస్తవానికి తెర లాగా అధిష్ఠాన స్వరూపమైన ఆత్మ యందే సర్వమూ సాగిపోతూ ఉంది. తెర మీద బొమ్మల లాగా వచ్చేవి వస్తూ ఉంటాయి. పోయేవి పోతూ ఉంటాయి. కదిలే బొమ్మలకు తెర ఆధారంగా ఉన్నట్లు ఆత్మ సర్వాధిష్ఠాన స్వరూపమై శోభిస్తూ ఉంటుంది. ఇదే జ్ఞానము. ఆత్మజ్ఞానము. ఈ జ్ఞానమే మనలో వికసించాలి.

ప్రభాకరుని తేజముతో పద్మము వికసిస్తుంది. ఆత్మజ్ఞాన తేజముతో ముముక్షువుల

హృదయాలు విరబూయాలి. ఉపదేశాలన్నీ జ్ఞాన ప్రకాశములే. ఆ పని చేసేందుకే ఉపనిషత్తులు ఉన్నాయి. ఆ నిర్వాకం లోనే శ్రోత్రీయ బ్రహ్మనిష్ఠులైన ఆచార్యులు అలరారుతూ ఉంటారు. అదే ఆర్ష సంస్కృతిలో శ్రవణ వైభవం.

శ్రవణము తోనే బ్రతుకు తెల్లవారాలి. అలాగని, బ్రతుకంతా శ్రవణమే కాకూడదు. మనన నిదిధ్యాసల చేత నిర్వికల్పం సిద్ధించేలా సాధకులు ప్రయత్నశీలురై ఉండాలి.

గురువులు చేయవలసిం దంతా చేస్తారు. వారి శిక్షణ లోనే మనం ఎదగాలి. వారి రక్షణే బుద్ధిని కవచంలా కాపాడుతుంది. కాని, రెక్కలు వచ్చినంత వరకు పిల్లల్ని పక్షి తన సంరక్షణ లోనే ఉంచుకుంటుంది. అంతే గాని, అవి బ్రతికినంత కాలం తల్లి పక్షి అంటి పెట్టుకొని ఉండదు; ఉండలేదు కూడా. గురుశిష్య సంబంధం కూడా ఇలాగే ఉంటుంది.

తింటూ ఉంటే దేహం పెరుగుతూ ఉంటుంది. కాని, వింటూ ఉంటే, దేహ భావన తరుగుతూ ఉండాలి. ఆ దిశగా ముముక్షువులు తీవ్రంగా శ్రమించాలి. జ్ఞానసాధన అనేది కత్తి మీద సాము లాంటిది.

క్షురస్య ధారా నిశితా దురత్యయా
దుర్గం పథ స్తత్కవయో వదన్తి।

మంగలి కత్తి యొక్క **(క్షురస్య)** పదునైన అంచు వలె **(నిశితా ధారా)** నడుచుటకు శక్యము కాదో **(దురత్యయా)**, అలాగే జ్ఞానమార్గమును **(తత్)** కష్టమైన మార్గముగా **(దుర్గం పథ)** మహర్షులు **(కవయః)** లేదా జ్ఞానులు చెబుతున్నారు **(వదన్తి)** అన్నది కఠోపనిషత్తు.

మార్గం ఇలా దుస్తరంగా ఉన్నది కనుకనే గురువులు లభ్యమైనపుడు అశ్రద్ధ చేయకుండా సత్యమార్గాన్ని తెలుసుకోవాలి. అలసత్వానికి ఇది సమయం కాదు. **ఉత్తిష్ఠత! జాగ్రత!** లేవండి. మేలుకోండి అని శ్రుతిమాత ప్రేమతో తట్టి లేపుతోంది. మార్గము అతి సూక్ష్మ మైనది, దుస్తర మైనది కనుకనే శ్రుతిమాత దయా రూపిణియై ప్రేమతో తల్లి వలె అజ్ఞాన నిద్ర నుండి మేల్కొలుపుతూ ఉంది అన్నారు శ్రీ శంకర భగవత్పాదులు **(శ్రుతిః అనుకంపయా ఆహ - మాతృవత్ అతి సూక్ష్మ బుద్ధి విషయత్వాత్ విజ్ఞేయస్య).** కృత పుణ్య పుంజులైన ముముక్షువులారా! ఇది జ్ఞానమార్గము. మనం చేసేది జ్ఞానసాధన. నడకను తీవ్రతరం చేయండి. సునిశితంగా విచారించుకొంటూ ప్రగతి మార్గంలో చరించండి.

కాలం అన్ని వేళల అనుకూలంగా ఉండదు. కాని, ఒక్క విషయాన్ని గుర్తు పెట్టుకోండి. అదెలాంటి పుణ్యకాలమో నాకు తెలియదు గాని, మనం ఎంతో శ్రమించి అభ్యసించిన వన్నీ మరచిపోయే కాల మదే. అది కాలమహిమ కాదు; మహిమ గల కాలము. కాలము గాని కాలము. కాలాతీతమైన కాలము. మరొకటి అగుపించని కాలము. వేరొకటి తెలిసిరాని కాలం. అదే మనం ఎదురు చూచే కాలం. ఎద నిండే కాలం, ఎద పండే కాలం.

ఓం . . . ఓం . . . ఓం . . .

ॐ స్వామి సుందర చైతన్యానంద

